నేడు 'మీ కోసం' కార్యక్రమం రద్దు

కలెక్టరేట్, ఆగస్టు 25: శ్రీ కృష్ణాష్టమి సందర్భంగా సోమవారం నిర్వహించనున్న ప్రజా ఫిర్యాదుల వేదిక 'మీ కోసం' కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి ఎం.అప్పారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. మళ్లీ సెప్టెంబరు 2న ప్రజా ఫిర్యాదుల కార్యక్రమం యథావిధిగా జరుగుతుందన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.అలాగే శ్రీకాకుళంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించనున్న 'మీ కోసం' కార్యక్రమాన్ని రద్దు చేశామని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఒక ప్రకటనలో వెల్లడించారు.

పలాసలోనా.. వద్దే వద్దు

- పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు వెనుకంజ
- రూ.10కోట్ల మేర బిల్లుల బకాయిలు
- ఏడాదిన్నరగా కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు
- పట్టించుకోని ఇంజనీరింగ్ అధికారులు
- సమన్వయలోపంతో కుంటుపడిన అభివృద్ధి



పలాస-కాశీబుగ్గలోని కేటీ రోడ్డులో కొత్తగా వేసిన విద్యుత్ స్తంభాలివి. ఇక్కడ ఏడాదిన్నర కిందట కేటీ రోడ్డు నిర్మించారు. అంతకు ముందు రోడ్డుకు ఇరువైపులా రెండు కిలోమీటర్ల పొడవునా ఉన్న 150 భారీ విద్యుత్ స్తంభాలు ఉండేవి. వీటిని మార్చడం, కొత్త స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయడానికి శ్రీకాకుళం నగరానికి చెందిన ఓ కాంట్రాక్టర్‌కు రూ.1.20 కోట్లకు ఒప్పందంతో అధికారులు పనులు అప్పగించారు. ఆయన ఆఘమేగాలపై పనులు పూర్తిచేశారు. కానీ ఇప్పటివరకూ కాంట్రాక్టర్‌కు రూపాయి కూడా బిల్లు చెల్లించలేదు. ఏడాదిన్నరగా ఆయన ఇంజనీరింగ్ అధికారులు, కమిషనర్, పాలకవర్గం చుట్టు తిరుగుతున్నా అదిగో ఇదిగో అంటూ కాలయాపన చేస్తున్నారు. ప్రశ్నిస్తే 14వ ఆర్థిక సంఘం నిధుల్లో పెట్టామని, కాదుకాదు.. 15వ ఆర్థిక సంఘ నిధులని, చివరకూ జనరల్ ఫండ్ నుంచి చెల్లిస్తామని చెబుతున్నారు. చివరకు ఆ ఫైల్ ఇంతవరకూ కదలలేదని తెలియడంతో ఆ కాంట్రాక్టర్.. మునిసిపల్ పనులు ఎందుకు చేశానా? అని ఆవేదన చెందుతున్నారు.

(పలాస)

పలాస-కాశీబుగ్గ మునిసిపాటీ అంటేనే కాంట్రాక్టర్లు హడలిపోతున్నారు. ఆ మునిసిపాలిటీలో మేము అభివృద్ధి పనులు చేయలేము బాబోయ్ అంటూ తెగేసి చెబు తున్నారు. వైసీపీ పాలనలో చేపట్టిన వివిధ అభి వృద్ధి పనులకు సంబంధించి మొత్తం కాంట్రా క్టర్లకు రూ.10కోట్ల మేర బకాయిలు ఉండడమే దీనికి కారణ. గత ప్రభుత్వం బిల్లులు సక్రమం గా చెల్లించకపోవడంతో.. పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీలో పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముఖం చాటేస్తున్నారు. దీంతో ఇంజనీరింగ్ అధికారులు, కార్యాలయం అధికా రులు, పాలకవర్గం మధ్య సమన్వయలోపంతో మొత్తం అభివృద్ధి పనులన్నీ పడకేశాయి. ఒక ఇంజనీరింగ్ అధికారి.. ఇక్కడ చక్కబెట్టాల్సిన ఫైల్స్ అన్నీ తీసుకెళ్లి ఇంట్లో దాచుకున్నారు. ప్రశ్నిస్తే ఒక్కో ఫైల్‌ను తీసుకువచ్చి క్లియర్ చేస్తున్నారనే ప్రచారం ఉంది. ఎందుకంటే ఆ అధికారి ఇక్కడున్నది కేవలం వారికి ఒక రోజు కావడంతో.. పనులన్నీ కిందిస్థాయి సిబ్బందితో చేస్తు చివరకు అతని సంతకాల కోసం శ్రీకాకుళం తరలిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.

● అధికారుల తీరుపై విమర్శలు..

పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీలో ఇంజనీరింగ్ అధికారుల తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొంతమంది కాంట్రాక్టర్లు పనులు చేయకుండానే వారికి బిల్లులు చెల్లిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. మరికొంత మంది పనులు పూర్తిచేసినా బిల్లుల చెల్లింపులో జాప్యం చేస్తున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. సాక్షాత్తు మునిసిపల్ చైర్మన్ బళ్ల గిరిబాబు ప్రాతినిథ్యం వహిస్తున్న అంతరకుడ్డ రహదారి పనులు వైసీపీ హయాంలో అస్తవ్యస్తంగా చేశారు. దీంతో వాటి బిల్లులు ఇవ్వొద్దని చైర్మన్ చెప్పినా.. పనులు పూర్తిచేయకుండానే ఇంజనీరింగ్ అధికారులు కాంట్రాక్టర్‌కు రూ.45లక్షలు చెల్లించారు. ఆ కాంట్రాక్టర్ పనులు మధ్యలో విడిచిపెట్టి పరారీ అయ్యాడు. అదనంగా జనరల్ ఫండ్ రూ.15లక్షలతో అధికారులు ఎలాగోలా పనులు పూర్తిచేయించారు. ఈ వ్యవహారంలో అత్యుత్సాహం చూపించిన ఇంజనీర్లు.. మిగిలిన పనులపై ఎందుకు తాత్సారం చేస్తున్నారో వారే సమాధానం చెప్పాల్సి ఉంది.

- పలాస-కాశీబుగ్గ జంటపట్టణాల మధ్య ముత్యాలమ్మకోనేరు-నెహ్రూపార్కు ఒకప్పుడు ఎంతో ఆహ్లాదంగా ఉండేది. బాగున్న ఈ పార్కును ఆధునికీకరణ పేరిట అధికారులు రూ.28లక్షలు వెచ్చించి నాశనం చేసేశారు. కొత్త పనులు చేపట్టి మధ్యలో వదిలేశారు. కాంట్రాక్టర్‌కు నిధులు చెల్లించకపోవడమే ఇందుకు కారణం. ప్రస్తుతం ఈ పార్కుకు రూ.కోటి నిధులు వెచ్చించినా పూర్తయ్యే పరిస్థితి లేదు.
- పలాస-కాశీబుగ్గ కేటీ రోడ్డు పనులు రెండు విభాగాలుగా చేసి ఇద్దరు కాంట్రాక్టర్లకు అప్పగించారు. రూ.3కోట్ల విలువైన ఈ పనులకు ఏ నిధులు కేటాయిస్తారో స్పష్టత లేకుండా పోయింది. ఎన్నికల ముందు ఆదరాబాదరాగా పనులు చేసి మధ్యలో విడిచిపెట్టారు. కాంట్రాక్టర్లకు నిధులు ఇవ్వకపోవడంతో మధ్యలోనే పనులు ఆగిపోయాయి. దీనిపై కొంతమంది విజిలెన్స్‌కు ఫిర్యాదు చేయడంతో ఆ సాకు చూపిస్తూ ఇంజనీరింగ్ అధికారులు తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు.
- కాశీబుగ్గ గాంధీనగర్‌లో 45 అడుగుల రోడ్డు వ్యవహారానికి సంబంధించి ఇటీవల కోర్టు తీర్పు ఇచ్చింది. ఈ నేపథ్యంలో మునిసిపల్ కమిషనర్ యుద్ధ ప్రాతిపదికన అక్కడున్న ఆక్రమణలు తొలగించారు. అయితే అదేరీతిలో ఇంజనీరింగ్ అధికారులు రహదారిని నిర్మించాల్సి ఉంది. దీనికి అనేక సాకులు చెబుతు పనులు చేయకుండా కాలయాపన చేశారు. దీంతో పాలకవర్గం స్పందించి లేఖలు అందించాల్సిన పరిస్థితి ఏర్పడింది.



పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీ కార్యాలయం



● ఇంకా అదేబాటలో..

వైసీపీ ప్రభుత్వ హయాంలో.. ఆ పార్టీ నాయకులు మునిసిపల్ కార్యాలయంలోని వివిధ విభాగాలను వారి గుప్పెట్లో పెట్టుకున్నారు. ఇంజనీర్లను ఒకరు, కార్యాలయం సిబ్బందిని మరొకరు.. ఒప్పంద కార్మికులును ఇంకొకరు.. ఇలా మొత్తం పంచేసుకుని పాలన సాగించారు. పాలకవర్గం ఉన్నా, సభ్యులకు తెలియకుండానే పనులు సాగిపోతుండడంతో వారు సైతం మౌనం దాల్చాల్సి వచ్చింది. ప్రస్తుతం ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వైసీపీ నాయకులు పక్కకు తప్పుకున్నారు. అయితే మునిసిపల్ అధికారులు మాత్రం అదే నిషాలో ఉంటూ పాలకవర్గం మాటలను పెడచెవిన పెడుతున్నారనే ప్రచారం ఉంది. అధికారుల సహకారం లేక పాలన పూర్తిగా అస్తవ్యస్తమైంది. కమిషనర్ మాట ఇంజనీరింగ్ అధికారులు వినకపోవడం.., ఇంజనీరింగ్ అధికారుల మాట కిందిస్థాయి సిబ్బంది పట్టించుకోకపోవడం జరుగుతోంది. వారు సైతం నిత్యం సెలవులు, వివిధ సాకులతో గైర్హాజరు కావడంతో పాలన పూర్తిగా కుంటుపడింది. ప్రస్తుతం ఈ అధికారులు మాకు వద్దు మొర్రో అన్నదాకా వ్యవహారం వెళ్లిందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఎమ్మెల్యే గౌతు శిరీష స్పందించి.. మునిసిపల్ పాలన గాడిలో పెట్టాల్సి ఉందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. పాలకులు, అధికారులు సమన్వయంతో అభివృద్ధి పనులు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఆదిత్యాలయ ఈవోగా రమేష్‌బాబు



అరసవల్లి, ఆగస్టు 25: అరసవల్లిలోని ఆదిత్యాలయ ఈవోగా డీఎల్‌వీ రమేష్‌బాబు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకూ విధులు నిర్వహించిన డీసీ చంద్రశేఖర్ బదిలీపై అన్నవరం దేవస్థానానికి వెళ్లిపోయారు. రమేష్‌బాబు అన్నవరం దేవస్థానం నుంచి డీసీగా పదోన్నతిపై ఈ ఏడాది ఫిబ్రవరి 8న అరసవల్లి ఈవోగా వచ్చారు. మళ్లీ మార్చి 15న అన్నవరం దేవాలయానికి బదిలీపై వెళ్లిపోయారు. ఆయన స్థానంలో అన్నవరం నుంచి డీసీ చంద్రశేఖర్ అరసవల్లి వచ్చారు. వర్కింగ్ అరేంజ్‌మెంట్ పద్ధతిలో విధుల్లో చేరిన వీరికి సాంకేతిక సమస్యలతో ఆరు నెలలుగా జీతాలు అందలేదు. ట్రెజరీ అధికారులు సీఎం చంద్రబాబు దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లగా వర్కింగ్ అరేంజ్‌మెంట్ ఆర్డర్‌ను రద్దు చేశారు. దీంతో ఇద్దరూ యథాస్థితి స్థానాల్లో కొనసాగనున్నారు. ఈ మేరకు అరసవల్లి ఈవోగా రమేష్‌బాబు బాధ్యతలు చేపట్టారు.

నాన్న వెంటే మృత్యుఒడికి..

- రోడ్డు ప్రమాదంలో తండ్రీ కొడుకు దుర్మరణం
- రణస్థలం హైవేపై ఘటన
- ఉప్పరనాయుడువలసలో విషాదఛాయలు



రామకృష్ణ, కిరణ్‌కుమార్ (ఫైల్)

రణస్థలం, ఆగస్టు 25: వారిద్దరూ తండ్రీ కుమారులైనా.. స్నేహితులుగా మెలిగేవారు. ఇంట్లో సరదాగా మాట్లాడుకునేవారు. ఏ పని తలపెట్టినా ఒకరికొకరు చెప్పుకునేవారు. శుభకార్యాలకు వెళ్లాల్సివస్తే కలిసే బయలుదేరేవారు. ఆదర్శమైన వారి అనుబంధాన్ని చూసి విధికే కన్నుకుట్టిందేమో.. రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు ఇద్దరినీ ఒకేసారి తిరిగిరాని లోకాలకు తీసుకుపోయింది. కళాశాలలో చదువుతున్న కుమార్తెను చూసేందుకు వెళ్లి వస్తుండగా.. వారి ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి లారీ ఢీకొంది. దీంతో ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందగా విషాదం అలుముకుంది. మరణంలోనూ వెనుక నుంచి తండ్రిని హత్తుకుని.. అచేతనంగా పడిన కుమారుడిని చూసిన ప్రతి కన్నూ చెమర్చింది. విజయనగరం జిల్లా రేగిడి మండలం ఉప్పరనాయుడు వలసకు చెందిన కరణం రామకృష్ణ(52), కరణం కిరణ్‌కుమార్ (20) విషాదాంతమిది. రణస్థలంలో యూబీ పరిశ్రమ ఎదురుగా జాతీయ రహదారిపై ఆదివారం మధ్యాహ్నం ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

- రేగిడి ఆమదాలవలస మండలం ఉప్పరనాయుడువలసకు చెందిన కరణం రామకృష్ణ, రాణీరత్నం దంపతులకు ఇద్దరు పిల్లలు. కుమారుడు కిరణ్‌కుమార్ విజయనగరంలోని ఓ ఇంజినీరింగ్ కాలేజీలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. రెండు రోజుల కిందట సెలవు పెట్టి ఇంటికి వచ్చాడు. కుటుంబ సభ్యులతో సరదాగా గడిపాడు. కుమార్తె భోగాపురంలోని ఓ ఇంజినీరింగ్ కాలేజీలో పది రోజుల కిందటే చేరింది. ఆదివారం కుమార్తెను చూసేందుకు రామకృష్ణ.. తన కొడుకు కిరణ్‌తో కలిసి ద్విచక్రవాహనంపై భోగాపురంలోని కళాశాలకు వెళ్లాడు. కుమార్తెను కలిసిన తర్వాత తండ్రీ కొడుకులిద్దరూ భోగాపురం నుంచి శ్రీకాకుళం వైపు వస్తున్నారు. సరిగ్గా రణస్థలం యునైటెడ్ బేవరేజెస్ పరిశ్రమ సమీపంలో.. వెనుక నుంచి వస్తున్న లారీ వారిని ఢీకొట్టింది. దీంతో వారిద్దరూ రోడ్డుపై పడిపోగా.. తలకు బలమైన గాయాలు కావడంతో ఘటనా స్థలంలోనే మృత్యువాత పడ్డారు. తండ్రిని వెనుక నుంచి గట్టిగా పట్టుకుని కుమారుడు ప్రాణాలు విడిచిపెట్టడం చూసిన వారంతా కన్నీరుపెట్టారు. వీరిద్దరి మరణాన్ని కుటుంబ సభ్యులు జీర్ణించుకోలేకపోతున్నారు.
- జేఆర్‌పురం పోలీసులు చేరుకుని ఘటనపై ఆరా తీశారు. మదనపల్లి నుంచి ఒడిశా రాష్ట్రం బరంపురానికి టమాటా లోడుతో లారీ అతివేగంగా వెళ్లడంతో ఈ ప్రమాదం జరిగినట్టు గుర్తించారు. లారీడ్రైవర్ వెంకటరమణను అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చిరంజీవి తెలిపారు.
- రామకృష్ణ రాజాంలో సాయిట్రస్టు ద్వారా చేపట్టే సామాజిక కార్యక్రమాల్లో ముందుండేవారు. చిన్న పుట్టగొడుగుల పరిశ్రమ ఏర్పాటు చేసుకొని కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. భార్య రాణీరత్నం అంగన్‌వాడీ కార్యకర్తగా పనిచేస్తున్నారు. తండ్రీ కొడుకుల దుర్మరణంతో కుటుంబ సభ్యులు బోరున విలపించారు. రెండు రోజుల కిందటే సెలవు పెట్టి తమ కుమారుడు ఇంటికి వచ్చాడని.. ఇంతలో ఈ ప్రమాదం జరిగిందని తల్లి రాణీరత్నం రోదించారు. రిమ్స్ వద్ద కూడా మృతదేహాల కోసం నిరీక్షించగా.. రోదనలు మిన్నంటాయి.



మాట్లాడుతున్న కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

క్రీడా మైదానాల అభివృద్ధికి కృషి

- కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

శ్రీకాకుళం స్పోర్ట్స్, ఆగస్టు 25: క్రీడలకు ప్రాధాన్యమిస్తూ.. క్రీడాకారులకు అండగా ఉంటామని కేంద్ర పౌర, విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు తెలిపారు. క్రీడా మైదానాల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఆదివారం శ్రీకాకుళంలోని డీఈవో కార్యాలయం సమీపంలో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ నూతన భవనాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ.. 'క్రీడల ఖిల్లాగా జిల్లాకు పేరుంది. జిల్లాకు చెందిన ఎంతోమంది క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయస్థాయిలో రాణించారు. జిల్లాకీర్తిని దేశనలుమూలలా ఇనుమడింపజేశారు. క్రీడాకారులకు ప్రోత్సాహంలో భాగంగా రానున్న ఐదేళ్లలో అన్ని క్రీడాంశాల్లోనూ జిల్లా, రాష్ట్రస్థాయిలో పోటీలు నిర్వహించేందుకు కృషి చేస్తామ'ని తెలిపారు. ఎస్‌జీఎఫ్ భవనంపై క్రీడాకారులు విశ్రాంతి తీసుకునేందుకు నిధులు కేటాయించి.. ఆరు నెలల్లో నూతన భవనం నిర్మిస్తామన్నారు. ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ క్రీడలతోనే ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు. ఈ సందర్భంగా ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో పీఈటీ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎంవీ.రమణ, కార్యదర్శి ఎం.సాంబమూర్తి, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి బీవీ.రమణ, పి.సుందరరావు, పీఈటీలు, పీడీలు పాల్గొన్నారు.



లుకలాంలో ఇసుక డంపింగ్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు

లుకలాంలో ఇసుక సీజ్

- అక్రమ నిల్వలను పరిశీలించిన అధికారులు

నరసన్నపేట, ఆగస్టు 25: నరసన్నపేట మండలం లుకలాంలో 209.50 క్యూబిక్ మీటర్ల ఇసుక అక్రమ నిల్వలను అధికారులు సీజ్ చేశారు. వంశధార నదీ పరివాహక ప్రాంతమైన నరసన్నపేట నియోజకవర్గంలో ఇసుక అక్రమ తవ్వకాలపై 'ఒక్కటై తోడేస్తున్నారు' శీర్షికతో ఆదివారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు. ఆదివారం రెవెన్యూ, మైన్స్, విజిలెన్స్ అధికారులు లుకలాంలో అక్రమ రవాణాకు సిద్ధంగా ఉన్న ఇసుక నిల్వలను పరిశీలించారు. అంగన్‌వాడీ భవనం వద్ద 179.02 క్యూబిక్ మీటర్లు(59 కుప్పలు), పాత రైతుభరోసా కేంద్రం వద్ద 30.48 క్యూబిక్ మీటర్లు(10 కుప్పలు) ఇసుక నిల్వలను సీజ్ చేసి వీఆర్వో, వీపీవోకు అప్పగించారు. మైన్స్ అధికారుల ఆదేశాల మేరకు ఆ ఇసుకను ప్రభుత్వ భవనాల నిర్మాణం కోసం గృహ నిర్మాణశాఖ ఇంజనీరింగ్ అధికారులకు అప్పగిస్తామని తహసీల్దార్ సత్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో మైన్స్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏడీ కె.వెంకటేశ్వర్లు, ఆర్ఐ లోకేష్, వీఆర్వోలు లక్ష్మణరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా పత్రికల్లో కథనాలు రావడంతో.. అంబాజీపేట పాఠశాల వద్ద ఇసుక అక్రమ నిల్వలను యంత్రాల సహాయంతో ట్రాక్టర్లలోకి లోడింగ్ చేశారు. వాటిని రహస్య ప్రాంతాల్లో నిల్వ చేశారు. ఇసుక అక్రమ దందాకు పాల్పడుతున్న తెలుగు తమ్ముళ్ల తీరుపై టీడీపీ అధిష్ఠానం దృష్టి పెట్టింది. ఈ వ్యవహారంలో వైసీపీ నాయకులతో చేతులు కలిసి.. ఎవరెవరు దందా చేస్తున్నారనే విషయమై ఆరా తీస్తున్నట్టు సమాచారం.

నారాయణ.. నీరందేనా?

- ఎండిపోతున్న వరినాట్లు, ఎదలు
- ఆందోళన చెందుతున్న రైతులు

(పొందూరు)

నారాయణపురం కుడికాలువ ద్వారా సక్రమంగా సాగునీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ కాలువ ద్వారా మూడు మండలాల పరిధిలో సుమారు 18,600 ఎకరాల్లో సాగు చేసేవారు. ప్రస్తుత ఖరీఫ్ వేళ శివారు ప్రాంతాలకు సక్రమంగా నీరు అందక వరినాట్లు ఎండిపోతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఏటా తమకు పంట నష్టం తప్పడం లేదని వాపోతున్నారు. సంతకవిటి, పొందూరు, ఎచ్చెర్ల మండలాల పరిధిలో 50.6 కిలోమీటర్ల మేర నారాయణపురం కుడి ప్రధాన కాలువ వ్యాపించి ఉంది. దీంతోపాటు మరో 50 కిలోమీటర్ల పరిధిలో డిస్ట్రిబ్యూటరీ కాలువలు ఉన్నాయి. వీటి ద్వారా ఈ మూడు మండలాల్లో 18,600 ఎకరాల్లో వరి పంట సాగవుతోంది. నాగావళి నది పరివాహక ప్రాంతాల ద్వారా నారాయణపురం కుడికాలువకు నీరు చేరేది. సంతకవిటి మండలం రంగారాయపురం నుంచి ఎచ్చెర్ల మండలం భగీరథపురం వరకు నారాయణపురం కాలువ నీరు పారేది. నారాయణపురం కాలువ ద్వారా అధికారులు ఏటా జూలైలో సాగునీటిని విడిచిపెట్టేవారు. కానీ ఈ ఏడాది ఆలస్యమైంది. ఎట్టకేలకు ఆదివారం సాగునీరు విడిచిపెట్టారు. కానీ ఆశించినస్థాయిలో వర్షాలు లేక డిస్ట్రిబ్యూటరీ కాలువకు సైతం నీరందడంలేదు. దీంతో వరినాట్లు, ఎదలు ఎండిపోతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. కాలువల్లో గుర్రపుడెక్క పేరుకు పోయిందని, కనీసం దానిని కూడా అధికారులు తొలగించడం లేదని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి శివారు ప్రాంతాలకు సాగునీరు అందించేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



తోలాపి వద్ద ఎండిపోతున్న వరినాట్లు



గోకర్ణపల్లి సమీపంలో నీరులేక వెలవెలబోతున్న నారాయణపురం కాలువ

● మరమ్మతులు లేవు



వైసీపీ ప్రభుత్వ హయాంలో కాలువకు మరమ్మతులు చేయలేదు. గుర్రపుడెక్క తొలగించలేదు. పూర్తిస్థాయిలో సాగునీరు అందక వరినాట్లు ఎండిపోతున్నాయి. రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.

-పొన్నాడ రామారావు, సాగునీటి వినియోగదారుల సంఘం మాజీ అధ్యక్షుడు, గొరింట

● శివారు ప్రాంతానికి అందడం లేదు



అధికారుల నిర్లక్ష్యంతో ఈ ఏడాది నారాయణపురం ఆయకట్టు పరిధిలో రైతులు పంటలపై ఆశలు వదులుకోవాల్సిందే. కాలువ ద్వారా కనీసం అడుగునీరు కూడా పారడంలేదు. శివారు ప్రాంతానికి కాలువనీరు అందే పరిస్థితి లేదు.

-సీపాన శ్రీరంగనాయకులు, మాజీ ఎంపీటీసీ, టీడీపీ శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి

నీరు విడిచిపెట్టాం

ఈ ఏడాది నదీ క్యాచ్‌మెంట్ ఏరియాలో వర్షాలు లేక అనుకున్నస్థాయిలో నీరు అందివ్వలేకపోయాం. తోటపల్లి, మడ్డువలస అధికారులతో మాట్లాడి 400 క్యూసెక్కుల నీరు కాలువకు విడిచిపెట్టాం. ఆదివారం సాగునీరు విడుదల చేశాం. శివారు ప్రాంతాలకూ నీరందేలా చర్యలు చేపడతాం.

- రవికుమార్, ఏఈ, నారాయణపురం ప్రాజెక్టు



దిక్సూచి
DIKSUCHI

"ప్రస్తుతం మనం అనుసరిస్తున్న పౌరస్మృతిలో మతతత్వ ఛాయలు ఉన్నాయి. మతం ఆధారంగా వివక్షను ప్రోత్సహించేలా ఉంది. దాని స్థానంలో 'లౌకిక పౌరస్మృతి'ని తీసుకురావాల్సిన అవసరం ఉంది" అని స్వాతంత్ర్య దినోత్సవం రోజున ఎర్రకోటపై జాతీయ పతాకావిష్కరణ సందర్భంగా ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. సుప్రీంకోర్టు కూడా అనేక సార్లు ఉమ్మడి పౌరస్మృతి గురించి చర్చించి, దీన్ని అమల్లోకి తేవాలని ఆదేశాలు ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. దీంతో ఈ అంశం మరోసారి దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఈ సందర్భంగా 'ఉమ్మడి పౌరస్మృతి' అంటే ఏమిటి? చట్టాలు వ్యక్తిగతంగా ఉండాలా? మత పరంగా ఉండాలా? లేదా దేశ పౌరులందరికీ ఒకే చట్టం వర్తింప జేయాలా? అనే అంశాలను సమగ్రంగా చర్చిద్దాం.

ఉమ్మడి పౌరస్మృతి
'ఒకే దేశం - ఒకే చట్టం'

ఇండియన్ పాలిటీ

దొంగతనం, అత్యాచారం, హత్య... ఈ నేరాలు ఎవరు చేసినా వారి మతం, కులాలతో సంబంధం లేకుండా కోర్టులు శిక్షలు విధిస్తాయి. కానీ... పెళ్లి, విడాకులు, భరణం, దత్తత, వారసత్వం, మహిళలకు ఆస్తిహక్కు వంటి విషయాల్లో మాత్రం దేశ ప్రజలందరికీ ఒకే చట్టం వర్తించదు. హిందువులకు, ముస్లింలకు, క్రైస్తవులకు వారి వారి పర్సనల్ లాస్(మతం ఆధారంగా కల్పించిన వ్యక్తిగత చట్టాలు) ఆధారంగా శిక్షలు ఉంటాయి. అలాగే రాష్ట్రాలవారీగానూ అనేక చట్టాలు ఉన్నాయి. అలా కాకుండా పెళ్లి, విడాకులు, దత్తత, వారసత్వం, ఆస్తిహక్కు వంటి వాటి విషయాల్లో రాష్ట్రాలకు, మతాలకు అతీతంగా అందరికీ ఒకే చట్టం ఉండాలనే భావనకు ప్రతిరూపమే 'ఉమ్మడి పౌరస్మృతి'.

ఇతర దేశాల్లో ఉమ్మడి పౌరస్మృతి

- అమెరికాలో భిన్న మతాలను అవలంబించేవారు, భిన్న జాతులకు చెందిన ప్రజలు నివశిస్తున్నారు. అలాగని అక్కడ విడివిడిగా ప్రత్యేక చట్టాలు లేవు.
- ఫ్రాన్స్, జర్మనీ, చైనాలో కూడా మతాల ప్రాతిపదికన చట్టాలు లేవు.
- ఈజిప్ట్, మొరాకో, తుర్కియో వంటి ముస్లిం దేశాల్లోనూ అల్పసంఖ్యాక వర్గాలకు ప్రత్యేక చట్టాలు లేవు.

ఓ మైనర్ ముస్లిం బాలిక వివాహానికి సంబంధించి కేరళ హైకోర్టు ఇటీవల ఒక తీర్పును వెలువరించింది. 15 ఏళ్ల లోపు వివాహం చేసుకునే హక్కు ఉందని బాలిక తండ్రి చేసిన వాదనను తిరస్కరించింది. 'ఏ వ్యక్తి

ముందు దేశపౌరుడు, ఆ తరవాతే మతం

అయినా ముందు దేశ పౌరుడని, ఆ తరవాతే ఆయా మతాల సభ్యులని పేర్కొంటూ.... హిందువైనా, ముస్లిమైనా, క్రిస్టియన్ అయినా.... అందరికీ బాల్య వివాహ నిషేధచట్టం(2006) వర్తిస్తుందని కేరళ హైకోర్టు 28 జూలై 2024న స్పష్టం చేసింది.


పర్సనల్ లాస్

మన దేశంలో పౌరుల వ్యక్తిగత అంశాలైన పెళ్లి, ఆస్తులు, వారసత్వం, దత్తత వంటి వాటికి సంబంధించి ప్రస్తుతం అమల్లో ఉన్న చట్టాలను మతం ఆధారంగా రూపొందించారు. అవి... హిందూ వివాహ చట్టం(1955), హిందూ వారసత్వ చట్టం(1956), హిందూ దత్తత నిర్వహణ చట్టం(1956); భారతీయ క్రైస్తవ వివాహ చట్టం(1957), భారత విడాకుల చట్టం(1969); పార్శీ వివాహ, విడాకుల చట్టం(1936), ముస్లిం పర్సనల్ లా అప్లికేషన్ యాక్ట్(1937), ఈశాన్య రాష్ట్రాల సంప్రదాయ చట్టాలు, కశ్మీర్ సంప్రదాయ చట్టాలు మొదలైనవి.

(మిగతా రేపటి దిక్సూచిలో)



డాక్టర్ సుంకర రమాదేవి,
అసిస్టెంట్ ప్రొఫెసర్



ఎలిజిబిలిటీ టెస్ట్

రీజనింగ్

ఏపీపీఎస్సీ పోటీ పరీక్షల ప్రత్యేకం

రీజనింగ్‌కి సంబంధించిన ఎలిజిబిలిటీ టెస్ట్ అనే ఈ టాపిక్‌కి చాలా ప్రాధాన్యం ఉంది. ముఖ్యంగా ఎస్.ఐ., బ్యాంకింగ్ మొదలైన పరీక్షల్లో ఈ విభాగం నుంచి ప్రశ్నలు అడిగే అవకాశం ఉన్నది.

ఈ విభాగానికి సంబంధించిన ప్రశ్నల్లో ముందుగా ఏదైనా ఉద్యోగానికి, కళాశాలలో ప్రవేశానికి, బ్యాంకులో లోన్ లభించడానికి మొదలైన వివిధ అంశాలకు అర్హతలు నిర్ణయిస్తారు. తదుపరి వివిధ వ్యక్తుల వ్యక్తిగత సమాచారం (పర్సనల్ డేటా) తెలుసుకుంటారు. ఆ సమాచారంలోని అంశాలు ప్రశ్నలో ఇచ్చిన అర్హతలకు సరిపోయిందా లేదా పరిశీలించి దానిని బట్టి ఐచ్ఛికాలుగా ఎ, బి, సి, డి, ఇ లలో సరైన దానిని సమాధానంగా గుర్తించాలి. గ్రూప్ 1 కోచింగ్‌ను అందించే ఒక ప్రముఖ శిక్షణసంస్థలో ఉచిత కోచింగ్ ప్రవేశానికి విద్యార్థికి తప్పనిసరిగా కింది అర్హతలు ఉండాలి.

1. విద్యార్థి కచ్చితంగా పోస్ట్ గ్రాడ్యుయేట్ చదివి ఉండాలి. పోస్ట్ గ్రాడ్యుయేట్‌లో తప్పనిసరిగా ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణత పొంది ఉండాలి.
2. విద్యార్థి వయసు 2023 మే 25 నాటికి 22 సంవత్సరాలకు తగ్గకూడదు, 30 సం॥లకు మించకూడదు.
3. విద్యార్థి సంరక్షకుల వార్షికాదాయం లక్ష రూపాయలకు మించకూడదు.
4. విద్యార్థి కోచింగ్ శిక్షణాకాలం పూర్తయిన తరవాత రెండు నెలలు లేదా పరీక్ష తేదీ వరకు (ఏదీ ముందు జరిగితే అలా) తప్పనిసరిగా కోచింగ్ నిర్వాహకులు తెలిపిన విధంగా ప్రిపరేషన్ కొనసాగిస్తూ శిక్షణసంస్థలోనే ఉండాలి.
5. ఆ సంస్థ ద్వారా ఉచిత కోచింగ్ పొంది ఉద్యోగానికి ఎన్నికైతే తప్పనిసరిగా ఆ సంస్థకు 50,000 రూపాయలను విరాళంగా ఇవ్వడానికి సుముఖత తెలుపుతూ అంగీకారపత్రంపై సంతకం చేయాలి.
6. పై వాటిలో ఒకటో అర్హతకు బదులుగా పోస్ట్ గ్రాడ్యుయేషన్ ద్వితీయ శ్రేణిలో ఉత్తీర్ణత చెంది గ్రాడ్యుయేషన్‌లో 75% మార్కులు ఉన్నట్లయితే ఆ విద్యార్థి విషయం సేవాసంస్థ నిర్వాహకుల పరిశీలనకు వెళుతుంది.
7. పై వాటిలో అయిదో పాయింట్‌లో సూచించిన విధంగా అంగీకార పత్రానికి బదులు శిక్షణా కాలం జరుగుతున్న సమయంలోనే రూ.15,000/- చెల్లించడానికి సుముఖత తెలిపితే అభ్యర్థి విషయం కోచింగ్ సంస్థ (శిక్షణ సంస్థ) డైరెక్టర్ పరిశీలనకు వెళుతుంది.

పైన పేర్కొన్న అర్హతలు, నియమ నిబంధనలకు లోబడి కింద ఇచ్చిన వివిధ విద్యార్థుల వ్యక్తిగత సమాచారాన్ని ఆధారంగా చేసుకొని ఐచ్ఛికాల్లో తెలిపిన సమాధానాల్లో ఏది సరైనదో నిర్ణయించండి.

1. అవినాష్ ఎంటెక్ 70% మార్కులతో పూర్తి చేశాడు. పుట్టిన తేదీ 2002 జూన్ 1. అవినాష్ సంరక్షకుల వార్షికాదాయం రూ.96,000. అవినాష్ శిక్షణ పూర్తయిన తరవాత రెండు నెలలు శిక్షణసంస్థ దగ్గరే ఉండటానికి, అయిదో పాయింట్‌లో తెలిపినట్లు అంగీకారపత్రంపై సంతకం చేశాడు.

ఎ) అవినాష్ గురించి ఇచ్చిన వ్యక్తిగత సమాచారం సరిపోదు
బి) అవినాష్ విషయం సేవాసంస్థ నిర్వాహకుల పరిశీలనకు వెళుతుంది.
సి) అవినాష్ ఉచిత కోచింగ్‌కు అర్హుడు
డి) అవినాష్ ఉచిత కోచింగ్‌కు అనర్హుడు
ఇ) అవినాష్ విషయం శిక్షణసంస్థ డైరెక్టర్ పరిశీలనకు వెళుతుంది.

సమాధానం: (డి)

వివరణ: అవినాష్ పుట్టిన తేదీ 2002 జూన్ 1. ప్రశ్నలో తెలిపిన 2023 మే 25 నాటికి అవినాష్‌కి 21 సంవత్సరాలు మాత్రమే. వయసు సరిపోదు కాబట్టి అవినాష్ ఉచిత కోచింగ్‌కు అనర్హుడు.

2. దినేష్ ఎమ్మే 56% మార్కులతో పూర్తి చేశాడు. అతను పుట్టినతేదీ 1996 ఆగస్టు 24. డిగ్రీలో అతనికి 82% మార్కులు లభించాయి. దినేష్ సంరక్షకుల వార్షిక ఆదాయం రూ.93,000/-. శిక్షణ పూర్తయిన తరవాత పరీక్ష తేదీ వరకు శిక్షణసంస్థ వద్దే ఉండటానికి నిర్ణయించుకున్నాడు. అయిదో పాయింట్‌లో తెలిపిన విధంగా అంగీకార పత్రంపై సంతకం చేశాడు.

ఎ) దినేష్ ఉచిత కోచింగ్‌కు అనర్హుడు
బి) దినేష్ ఉచిత కోచింగ్‌కు అర్హుడు
సి) దినేష్ ఇచ్చిన సమాచారం సరిపోదు.
డి) దినేష్ విషయం శిక్షణసంస్థ డైరెక్టర్ పరిశీలనకు వెళుతుంది ఇ) దినేష్ విషయం సేవాసంస్థ నిర్వాహకుల పరిశీలనకు వెళుతుంది

సమాధానం: (ఇ)

వివరణ: దినేష్‌కు ఇచ్చిన అర్హతలలో 2, 3, 4, 5 అర్హతలు ఉన్నాయి. ఒకటో అర్హతకు బదులుగా 6వ పాయింట్‌లో తెలిపిన విధంగా పోస్ట్ గ్రాడ్యుయేషన్ ద్వితీయశ్రేణిలో ఉత్తీర్ణత చెంది గ్రాడ్యుయేషన్‌లో 82% మార్కులు పొందడం వలన దినేష్ విషయం సేవాసంస్థ నిర్వాహకుల పరిశీలనకు వెళుతుంది.

3. వికాస్ ఎమ్మెస్సీ 70% మార్కులతో పూర్తి చేశాడు. అతని సంరక్షకుల వార్షిక ఆదాయం రూ.60,000/-. కోచింగ్ పూర్తయిన తరవాత రెండు నెలలు శిక్షణసంస్థ వద్దనే ఉండటానికి నిశ్చయించుకుని అయిదో పాయింట్‌లో తెలిపిన విధంగా అంగీకారపత్రంపై సంతకం చేశాడు.

ఎ) వికాస్ ఉచిత కోచింగ్‌కు అనర్హుడు
బి) వికాస్ ఉచిత కోచింగ్‌కు అర్హుడు
సి) ఇచ్చిన సమాచారం సరిపోదు
డి) వికాస్ విషయం సేవాసంస్థ నిర్వాహకుల పరిశీలనకు వెళుతుంది
ఇ) వికాస్ విషయం శిక్షణాసంస్థ డైరెక్టర్ పరిశీనలకు వెళుతుంది

సమాధానం: (సి)

వివరణ: వికాస్ పుట్టినతేదీ గురించి ఎటువంటి సమాచారం లేదు.

4. తేజ ఎమ్మే 75% మార్కులతో పూర్తి చేశాడు. అతని సంరక్షకుల వార్షిక ఆదాయం రూ.78,000/-. కాని శిక్షణ పొందడానికి 15,000/- చెల్లించడానికి అంగీకరించాడు. శిక్షణకాలం పూర్తయిన తరవాత రెండు నెలలు శిక్షణసంస్థ వద్దే ఉండటానికి నిర్ణయించుకున్నాడు. కాని అయిదో పాయింట్‌లో తెలిపిన విధంగా అంగీకారపత్రంపై సంతకం చేయలేదు. తేజ పుట్టిన తేదీ 1996 జూన్ 11.

ఎ) తేజ ఉచిత కోచింగ్‌కు అర్హుడు
బి) తేజ విషయం శిక్షణసంస్థ డైరెక్టర్ పరిశీలనకు వెళుతుంది
సి) తేజ గురించి ఇచ్చిన వ్యక్తిగత సమాచారం సరిపోదు డి) తేజ ఉచిత కోచింగ్‌కు అనర్హుడు
ఇ) తేజ విషయం సేవాసంస్థ నిర్వాహకుల పరిశీలనకు వెళుతుంది.

సమాధానం: (బి)

వివరణ: తేజకు ఇచ్చిన అర్హతలలో 1, 2, 3, 4 అర్హతలు ఉన్నాయి. అయిదో అర్హతకు బదులుగా ఏడో పాయింట్‌లో తెలిపిన విధంగా రూ.15,000/- చెల్లిస్తున్నందున తేజ విషయం శిక్షణసంస్థ డైరెక్టర్ పరిశీలనకు వెళుతుంది.

5. ప్రశాంత్ ఎంకామ్ 65% మార్కులతో పూర్తి చేశాడు. ప్రశాంత్ శిక్షణ పూర్తయిన తరవాత రెండు నెలలు శిక్షణసంస్థ వద్దే ఉండడానికి నిర్ణయించుకున్నాడు. అయిదో పాయింట్‌లో తెలిపిన విధంగా అంగీకార పత్రంపై సంతకం చేశాడు. అతను పుట్టిన తేదీ 1994 ఏప్రిల్ 4. ప్రశాంత్ సంరక్షకుల వార్షిక ఆదాయం రూ.1,20,000/-.

ఎ) ప్రశాంత్ విషయం శిక్షణసంస్థ డైరెక్టర్ పరిశీలనకు వెళుతుంది
బి) ప్రశాంత్ ఉచిత శిక్షణకు అర్హుడు
సి) ప్రశాంత్ ఉచిత శిక్షణకు అనర్హుడు
డి) ప్రశాంత్ గురించి ఇచ్చిన వ్యక్తిగత సమాచారం సరిపోదు ఇ) ప్రశాంత్ విషయం సేవాసంస్థ నిర్వాహకుల పరిశీలనకు వెళుతుంది.

సమాధానం: (సి)

వివరణ: ప్రశాంత్ సంరక్షకుల వార్షికాదాయం రూ.1,20,000/-లు. మూడో అర్హతలో వార్షికాదాయం లక్ష రూపాయలకు మించకూడదని ఉన్నది. కాబట్టి ప్రశాంత్ ఉచిత శిక్షణకు అనర్హుడు.



డాక్టర్ పండిటి మీనాక్షి పవన్,
సీనియర్ ఫ్యాకల్టీ

అటకెక్కిన 'ఫిష్ ఆంధ్ర'

వైసీపీ హయాంలో వస్తు సామగ్రి కొనుగోలులో భారీ అవినీతి

- లబ్ధిదారులకు భారమైన ఫ్రాంచైజీ, బ్రాండింగ్
- వినియోగదారుల నుంచి కరువైన ఆదరణ
- లక్షల్లో నష్టపోయిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ యువత




అమరావతి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించడానికే 'ఫిష్ ఆంధ్ర' అంటూ డప్పు కొట్టిన వైసీపీ ప్రభుత్వం... ఆచరణలో భారీ అవినీతికి తెరతీసింది. వైసీపీ పార్టీ రంగులతో, ప్రచార ఆర్భాటంతో ఆరంభమైన 2,300 యూనిట్లలో చాలా వరకూ మూతపడ్డాయి. లబ్ధిదారులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు రూ.లక్షల్లో నష్టపోయారు. టీడీపీ ప్రభుత్వం దీనిపై దృష్టిపెడితే అవినీతి చేపలు దొరికే అవకాశం ఉంది. లబ్ధిదారులకు నగదు రాయితీ ఇచ్చి, నిర్దేశిత ప్రమాణాలతో రిటైల్ ఔట్‌లెట్లు ఏర్పాటు చేసుకోవాలని చెప్పాల్సిన మత్స్య శాఖ... ఫ్రాంచైజీ రుసుము చెల్లించాలని, పరికరాలను తాము చెప్పిన సంస్థ నుంచే తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. ఇక్కడే అవినీతి, అవకతవకలకు ఆస్కారం ఏర్పడింది. 'ఫిష్ ఆంధ్ర' కాస్తా... 'స్కామ్ ఆంధ్ర'గా మారింది. వస్తు సామాగ్రిని తమకు అనుకూలమైన సంస్థల నుంచి కొనుగోలు చేయించి, నిధుల గోల్‌మాల్‌కు తెరదీశారు. బ్యాంకు రుణం, కేంద్రం, లబ్ధిదారుని వాటా నిధులతో వస్తు సామాగ్రి కొనుగోలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాల్సిన తనవంతు వాటాను విడుదల చేయలేదు. లైవ్ ఫిష్ టబ్, బల్లలు, చేపలు శుద్ధి చేసే పనిముట్లు, శీతలీకరణకు రిఫ్రిజిరేటర్, ఐస్ తయారీ యంత్రం తదితర వస్తువులు... నాణ్యత ఏ మాత్రం లేని వాటిని ఎక్కువ ధరకు కొనుగోలు చేయించారు. లోగుట్టుగా అవినీతికి పాల్పడిన వైసీపీ నేతలు, అధికారులు... ప్రచారాన్ని మాత్రం ఊదరకొట్టారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా 20,000 మందికి ఉపాధి లభించిందని వైసీపీ ప్రభుత్వం ఘనంగా ప్రకటించింది. ఫ్రాంచైజీ పేరుతో ఆరంభంలో రూ.80 వేలు వసూలు చేసిన మత్స్య శాఖ... ఫిష్ ఆంధ్ర బ్రాండింగ్ కోసం ప్రతి నెలా రూ.7,000 చెల్లించాలన్న నిబంధన పెట్టింది. ప్రారంభించిన కొద్ది నెలలకే కొనుగోలు చేసిన వస్తు సామాగ్రిలో చాలా వరకూ మూలకు చేరింది. నిర్వహణ భారమయింది. లైవ్ ఫిష్ వ్యాపారానికి ఆదరణ లభించలేదు. దీంతో ఫిష్ ఆంధ్ర అటకెక్కింది. మళ్లీ 20 వేల మంది రోడ్డుపైకి వచ్చేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రారంభమైన ఈ పథకం తీరుతెన్నులపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తే అనేక అవకతవకలు బయటపడతాయి.

156 ఔషధాలపై కేంద్రం నిషేధం!

జాబితాను విడుదల చేసిన ఔషధ నియంత్రణ శాఖ

గుంటూరు(మెడికల్), ఆగస్టు 25: ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని 156 రకాల ఫిక్స్‌డ్ డోస్ కాంబినేషన్(ఎఫ్‌డీసీ) మందులపై కేంద్ర ప్రభుత్వం నిషేధం విధించింది. తక్షణం వీటి తయారీ, పంపిణీ, విక్రయాలు నిలిపివేయాలని కేంద్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ ఆదేశాలు జారీ చేసింది. నిషేధించిన మందుల్లో పలు యాంటీ బయోటిక్, యాంటీ అలర్జీ, అధిక రక్తపోటు, నొప్పి నివారణ మందులు, మల్టీ విటమిన్ ట్యాబ్లెట్లు తదితరాలు ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వం నియమించిన డ్రగ్ టెక్నికల్ అడ్వైజరీ బోర్డ్ (డీటీఏబీ) సూచనల మేరకు ఈ మందులపై కేంద్ర ఆరోగ్య శాఖ నిషేధం విధించింది. ఈ మేరకు ఈనెల 12వ తేదీన గెజిట్ నోటిఫికేషన్‌ను వెలువరించింది. నిషేధ మందుల జాబితాను అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు పంపింది. తాజాగా గుంటూరు జిల్లా ఔషధ నియంత్రణ శాఖ అధికారులు ఆ నిషేధిత మందుల జాబితాను విడుదల చేశారు. వీటిని తక్షణం దుకాణాల నుంచి తొలగించాలని ఆదేశిస్తూ జిల్లాలోని హోల్‌సేల్, రిటైల్ మందుల దుకాణాదారులకు సర్క్యులర్ జారీ చేశారు. ఈ మందుల కాంబినేషన్‌లో హేతుబద్ధత లేదని, పైగా రోగుల చికిత్సల్లో ఈ మందుల వినియోగం వల్ల ఆరోగ్యానికి హాని కలిగే ప్రమాదం ఉందని డీటీఏబీ నిపుణులు పేర్కొన్నారు. బాగా ప్రాచుర్యంలో ఉన్న పలు ప్రముఖ కంపెనీల ఉత్పత్తులు నిషేధిత మందుల జాబితాలో ఉండటం విశేషం. మెఫనమిక్ యాసిడ్, పారా సిటమాల్ కాంబినేషన్ ఇంజెక్షన్లను సాధారణంగా నొప్పి నివారణకు వినియోగిస్తారు. ఈ కాంబినేషన్ మందు వల్ల రోగుల్లో తీవ్రమైన దుష్ఫలితాలు తలెత్తుతున్నట్లు నిపుణులు గుర్తించారు. అదే విధంగా ఎసిక్లోఫెనాక్, పారాసిటమాల్ కాంబినేషన్ చాలా సాధారణంగా వైద్యులు ప్రిస్క్రైబ్ చేస్తుంటారు. ఈ కాంబినేషన్‌పైనా ప్రభుత్వం నిషేధం విధించింది. మొటిమల చికిత్స, ముక్కు దిబ్బడ, చర్మవ్యాధుల చికిత్సల్లో వాడే ఔషధాలు కూడా నిషేధిత జాబితాలో ఉన్నాయి. గతంలో 2018లో కేంద్ర ప్రభుత్వం 328 ఎఫ్‌డీసీ మందులపై నిషేధం విధించింది. ఆరేళ్ల తర్వాత మరోసారి పెద్ద సంఖ్యలో మందులపై నిషేధం విధిస్తూ కేంద్ర ఆరోగ్య శాఖ ఆదేశాలు జారీ చేయడం విశేషం.

1 నుంచి బీజేపీ సభ్యత్వం: పురందేశ్వరి



సర్పవరం జంక్షన్ (కాకినాడ), ఆగస్టు 25: 'పదకొండవ ఆర్థిక శక్తిగా ఉన్నటువంటి భారతదేశాన్ని ప్రధాని మోదీ పాలనలో ఐదో ఆర్థిక శక్తిగా అవతరించి ప్రపంచ పటంలో ఆవిష్కరించింది. రాబోయే ఆర్థిక సంవత్సరంలో మూడో ఆర్థికశక్తిగా చూడాలనే దిశగా బీజేపీ కూటమి ప్రయత్నిస్తోంది' అని రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరి అన్నారు. ఆమె కాకినాడలో పార్టీ సభ్యత్వ నమోదుపై నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. సెప్టెంబరు 1 నుంచి ప్రారంభించే పార్టీ సభ్యత్వ నమోదుకు అవగాహన కార్యక్రమాలు చేపట్టామన్నారు. 37 లక్షల మంది సభ్యత్వ నమోదు లక్ష్యంగా పెట్టుకున్నట్టు ఆమె తెలిపారు. కాగా, త్వరలో జమ్మూకశ్మీర్‌లో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కాంగ్రెస్ సారథ్యంలోని ఇండియా కూటమి తమ మేనిఫెస్టోలో ఆర్టికల్ 370, 35ఏలను పునరుద్ధరిస్తామని ప్రకటించడాన్ని బట్టి దేశాన్ని విచ్ఛిన్నం చేసే రీతిలో వ్యవహరిస్తారని మండిపడ్డారు. దీనిపై రాహుల్ గాంధీ ప్రజలకు జవాబు చెప్పాలని డిమాండ్ చేశారు. జిల్లా పార్టీ అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ: భువనేశ్వరి



హైదరాబాద్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్టు ద్వారా పేద అభ్యర్థులకు డీఎస్సీ ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి ఓ ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు జిల్లా కుప్పంలో ఈ శిక్షణ ఉంటుందని, అర్హులు వినియోగించుకోవాలని ఆమె కోరారు. శిక్షణ కాలంలో అభ్యర్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్ అందిస్తామని తెలిపారు.

బడితో చెడుగుడు!

నాడు-నేడుపై జగన్ సర్కారు చెప్పినవన్నీ అబద్ధాలే

- ప్రచారం కోసం పథకాన్ని వాడుకున్న వైసీపీ పెద్దలు
- చాలాచోట్ల ఎక్కడి పనులు అక్కడే నిలిపేసిన వైనం
- మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టిపెట్టని నేతలు
- జగన్ ప్రభుత్వంలో మూడు వేల కోట్లు పక్కదారి
- ఇప్పుడు వాటినేం చేయాలంటూ అధికారుల కసరత్తు
- పథకం పేరు 'మన బడి-మన భవిష్యత్తు'గా మార్పు
- స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీల భాగస్వామ్యంతో పనులు



(అమరావతి-ఆంధ్రజ్యోతి)

'నాడు-నేడు' పథకంతో ప్రభుత్వ బడుల రూపురేఖలు మార్చేస్తామని గత జగన్ ప్రభుత్వం ఆర్భాటం చేసింది. అయితే ఇందులో ప్రచారం తప్ప పనులేం చేయలేదని తేలింది. చాలాచోట్ల ఎక్కడి పనులు అక్కడే వదిలేసినట్లు వెల్లడైంది. ప్రభుత్వ బడుల్లో అద్భుతాలు అంటూ రాజకీయ లబ్ధి కోసం విశ్వప్రయత్నాలు చేసిన వైసీపీ పెద్దలు... వాటిలో మౌలిక సదుపాయాల పురోగతిపై దృష్టి పెట్టలేదు. దీంతో నాడు-నేడు మధ్యలోనే ఆగిపోయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అంచనా వేయగా నాడు-నేడు రెండో దశలో కేవలం 7.88శాతం పనులే పూర్తిచేసిన విషయం బయటపడింది. 22,311 బడుల్లో రెండోదశ పథకం ప్రారంభించగా కేవలం 1,759 బడుల్లో మాత్రం పనులు పూర్తయ్యాయి. 20,552 పాఠశాలల్లో మధ్యలోనే నిలిచిపోయాయి. ఇప్పుడు వాటినెలా పూర్తిచేయాలన్న దానిపై ప్రభుత్వం దృష్టి సారించింది. తొలుత కాంట్రాక్టు విధానంలో పనులు చేయించాలని యోచించినా, తల్లిదండ్రుల భాగస్వామ్యం ఉండాలని నిర్ణయానికొచ్చింది. కొత్తగా ఎన్నుకున్న స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీల భాగస్వామ్యంతో పనులు పూర్తి చేయాలని భావిస్తోంది. పనులు ఏ దశల్లో ఉన్నాయి? ఇంకా ఏ మేరకు నిధులు అవసరం? అనేదానిపై పాఠశాల విద్యాశాఖ అధికారులు కసరత్తు ప్రారంభించారు. కాగా 'నాడు-నేడు' పథకం పేరును 'మన బడి-మన భవిష్యత్తు'గా ప్రభుత్వం మార్చింది.

పనుల ప్రారంభంపైనా ఆరా

పనులు మధ్యలో వదిలేయడం ఒకెత్తు అయితే అసలు ఏ ప్రాతిపదికన బడుల్లో పనులు మొదలు పెట్టారనే అంశంపై కూడా పాఠశాల విద్యాశాఖ అధికారులు ఆరా తీస్తున్నారు. నాడు- నేడు పథకం ప్రారంభం నాటి అధికారులతో ఇటీవల సమావేశం నిర్వహించారు. ఆ బాధ్యతల నుంచి తప్పుకొని వెళ్లిపోయిన వారిని కూడా పిలిపించారు. మొదటి, రెండో దశల్లో పనులు ప్రారంభానికి బడులను ఏ ప్రాతిపదికపై ఎంపిక చేశారో తెలుసుకుంటున్నారు. నాడు-నేడు పేరుతో భారీగా నిధులు ఖర్చు చేశాక కొన్ని ప్రాథమిక పాఠశాలలు మూతపడ్డాయి. తరగతుల విలీనం ప్రక్రియ చేపట్టడంతో కొన్ని బడుల్లో విద్యార్థుల సంఖ్య జీరోకు చేరింది. దీంతో అక్కడి టీచర్లను ఇతర పాఠశాలలకు పంపి, ఆ బడులకు తాళాలు వేశారు. అయితే విద్యార్థుల సంఖ్య అంతంతమాత్రంగా ఉన్న బడులను ఎందుకు ఎంపిక చేయాల్సి వచ్చిందో ఇప్పుడు వివరాలు సేకరిస్తున్నారు.

ప్రాథమిక పాఠశాలలపై దృష్టి

ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు మెరుగ్గానే ఉన్నా ప్రాథమిక పాఠశాలల పరిస్థితి ఏటా దిగజారుతోంది. విద్యార్థులు లేక ఆ బడులు వెలవెలబోతున్నాయి. 20 మంది విద్యార్థులు కూడా లేని బడులు దాదాపు దాదాపు 12వేల వరకూ ఉన్నాయి. వీటిలో కేవలం ఒక్కరే టీచరు ఉన్నారు. దీంతో ప్రాథమిక పాఠశాలలను బలోపేతం చేయడంపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఆ బడుల్లోనూ ఒక్కో తరగతికి ఒక టీచర్‌ను నియమించే ఆలోచన చేస్తోంది. దాంతోపాటు అన్ని బడుల్లో మౌలిక వసతులు అభివృద్ధి చేయాలని, వచ్చే ఏడాది నాటికి టీచర్లను పెంచి విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ప్రయత్నించాలని ప్రణాళికలు రూపొందిస్తోంది.



ఎక్కడి పనులు అక్కడే

45వేల ప్రభుత్వ బడుల్లో మొత్తం మూడు దశల్లో మౌలిక సదుపాయాల కల్పన పూర్తిచేస్తామని జగన్ ప్రభుత్వం ప్రకటించింది. మొదటి దశలో 15,715 బడుల్లో పథకం ప్రారంభించగా, దాదాపుగా పూర్తయ్యాయి. రెండోదశ పనులు 2022లో ప్రారంభించారు. 22,311 బడుల్లో వసతులు అభివృద్ధి చేయడంతో పాటు అదనపు గదుల నిర్మాణం చేపట్టారు. రూ.8వేల కోట్ల అంచనాతో ప్రారంభించిన ఈ పనులకు ఇప్పటి వరకూ రూ.4,107 కోట్లు ఖర్చు చేశారు. అయితే రూ.7వేల కోట్లకు పైగా నిధులను వివిధ రూపాల్లో సమీకరించినా వాటిని పథకానికి వినియోగించకుండా పక్కదారి పట్టించారు. నిధుల లేమితో వేల సంఖ్యలో బడుల్లో పనులు మధ్యలో నిలిచిపోయి ప్రాంగణాలన్నీ అస్తవ్యస్తంగా మారాయి. దీనిపై ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పల్నాడు, కడప, విజయనగరం, మన్యం మినహా ఏ జిల్లాలోనూ పది శాతం పనులు కూడా పూర్తికాలేదు.

అభివృద్ధే ధ్యేయంగా పనిచేయాలి

● మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

కోటబొమ్మాళి: అభివృద్ధే ధ్యేయంగా పనిచేయాలని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పిలుపునిచ్చారు. ఆదివారం నిమ్మాడ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్లో టెక్కలి, సంతబొమ్మాళి, నందిగాం, కోటబొమ్మాళి మండలాల నుంచి వచ్చిన ప్రజలు నుంచి వినతులు స్వీకరించి సమస్యలు అడిగితెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టెక్కలి నియోజకవర్గంలో ప్రతి గ్రామానికి పూర్వ వైభవం తీసుకువస్తానని తెలిపారు. గ్రామాల్లో సాగు, తాగునీరు, రోడ్లు, డ్రైనేజీలు వంటి మౌలిక సదుపాయాలు కల్పనకు చొరవచూపాలని అధికారులను సూచించారు. బదిలీలపై వచ్చే అధికారులు చిత్తశుద్ధితో పనులు నిర్వహించి స్వర్ణ గ్రామాలుగా తీర్చిదిద్దాలని కోరారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో గ్రామాలు చీకటిమయమయ్యాయని తెలిపారు.

పశుగణాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

కోటబొమ్మాళి: పశుగణాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. పశువుల వ్యాధులు నివారణపై ఎప్పటి కప్పుడు ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తుండాలని కోరారు. ఆదివారం నిమ్మాడలోని క్యాంపు కార్యాలయంలో పశువైద్య సహాయ సంచాలకుడు ఎం.లోకనాథం, కురుడు పశువైద్యాధికారి లఖినేని కిరణ్‌కుమార్‌తో కలిసి గాలికుంటువ్యాధి, బ్రూసెల్లోసిస్ వ్యాధి నివారణ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అచ్చుతాపురం పశువైద్యులు పి. సంతోష్ కుమార్, పశువైద్య సహాయకులు పాల్గొన్నారు.

కళావేదిక నిర్మాణం కోసం కొలతలు

సంతబొమ్మాళి: సంతబొమ్మాళిలో మంత్రి అచ్చెన్నాయుడు శనివారం పర్యటించిన నేపథ్యంలో అధికారులు రంగంలోకిదిగారు. మాదిగవీధికి శ్మశాన వాటికకు రోడ్డుతోపాటు కళావేదిక నిర్మాణానికి అధికారులు కొలతలు వేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కాంతారావు, అల్లు రమేష్ పాల్గొన్నారు.



కోటబొమ్మాళి: క్యాంపు కార్యాలయంలో వినతిపత్రం స్వీకరిస్తున్న మంత్రి

ప్రతిభకు ప్రోత్సాహం

● ఎన్‌ఎంఎంఎస్‌కు దరఖాస్తుల స్వీకరణ

హిరమండలం: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేదవిద్యార్థులను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో కేంద్ర మానవ వనరులశాఖ ఏటా నిర్వహిస్తున్న నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్)కు నోటిఫికేషన్ వెలువడింది. ఈ మేరకు ఎనిమిదో తరగతిలో నిర్వహించే ఈ ప్రతిభా పరీక్షల్లో సత్తాచాటితే ఇంటర్ వరకూ స్కాలర్‌షిప్ అందుతుంది. 2024-25 సంవత్సరానికి సంబందించి ఎన్ఎంఎంఎస్ పరీక్ష ప్రకటన ఇటీవల కేంద్ర ప్రభుత్వం విడుదల చేసింది. విద్యార్థులు సంబంధిత పాఠశాల హెచ్‌ఎంల ద్వారా సెప్టెంబరు ఆరో తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని, పరీక్ష ఫీజు సెప్టెంబరు 10లోగా ఆన్‌లైన్‌లో పొందుపరిచిన ఎస్‌బీఐ లింక్ ద్వారా చెల్లించాలి. డిసెంబరు ఎనిమిదో తేదీన రెవెన్యూ డివిజన్ కేంద్రాల్లో పరీక్ష జరగనుంది.

●ఆన్‌లైన్‌లో దరఖాస్తు సెప్టెంబరు ఆరోతేదీ వరకూ దరఖాస్తు చేసుకోచ్చు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన విద్యార్థులను ఎంపికచేసి, తొమ్మిదోతరగతి నుంచి ఇంటర్ పూర్తి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఏటా రూ. 12 వేలు నేరుగా బ్యాంకు ఖాతాలో జమచేస్తుంది. ●ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్, ఎయిడెడ్, ఏపీ మోడల్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు మాత్రమే పరీక్ష రాసేందుకు అర్హులు.

ఇవీ అర్హతలు

●కుటుంబ వార్షికాదాయం రూ.3.50 లక్షలలోపు ఉండాలి. ● ఏడో తరగతిలో ఓసీ, బీసీ విద్యార్థులు 55 శాతం మార్కులు, ఎస్సీ, ఎస్టీ దివ్యాంగ విద్యార్థులకు కనీసం 50 శాతం మార్కులు వచ్చి ఉండాలి.● బీసీ, ఓసీ విద్యార్థులు రూ.100, ఎస్సీఎస్టీ విద్యార్థులు రూ.50 శాతం పరీక్ష ఫీజుగా చెల్లించాలి. ●కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో పాటు ఏడో తరగతి ఉత్తీర్ణత పత్రాలు ఉండాలి. ● మెంటల్ ఎబిలిటీ, ఆప్టిట్యూడ్ అంశాల్లో ఒక్కో పేపర్‌కు 90 మార్కులు చొప్పున పరీక్ష నిర్వహిస్తారు. 6,7,8 తరగతుల నుంచి ప్రశ్నలు వస్తాయి. 90 నిమిషాల్లో పరీక్ష జవాబులు రాయాల్సి ఉంటుంది.

నేడు అన్నక్యాంటీన్ పునఃప్రారంభం

టెక్కలి: టెక్కలి ఇందిరాగాంధీ జంక్షన్‌లో అన్న క్యాంటీన్ సేవలను సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పునఃప్రారంభించనున్నారు. ఇప్పటికే తాత్కాలికంగా అన్నక్యాంటీన్ సేవలకోసం షెడ్‌ను ఏర్పాటుచేశారు. అలాగే పూండి-పలాస, ఇచ్ఛాపురం-విశాఖకు రెండు ఆర్టీసీ హయ్యర్ బస్సులను కూడా మంత్రి ప్రారంభించనున్నట్లు టీడీపీ మండలాధ్యక్షుడు బగాది శేషగిరిరావు తెలిపారు.

నేడు కృష్ణాష్టమి వేడుకలు

పలాస/కాశీబుగ్గ: స్థానిక రథయాత్ర మైదానంలో కృష్ణాష్టమి వేడుకలు సోమవారం నిర్వహించనున్నట్లు నియోజకవర్గ శ్రీకృష్ణ యాదవ సేవా సమితి నాయకుడు లొడగల కామేశ్వరరావుయాదవ్ తెలిపారు. ఆదివారం స్థానిక మైదానంలో విలేకరులతో మాట్లాడుతూ ముఖ్య అతిధిగా పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష, కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడుతో పాటు జిల్లాలో ఉన్న ఎమ్మెల్యేలు హాజరుకానున్నారని తెలిపారు. వివిధ జానపద సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

నేడు వైద్యశిబిరం

పలాస: స్థానిక క్యాజూ లేబర్ కార్యాలయంలో సోమవారం ఉదయం పది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకూ వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు సంఘ అధ్యక్షుడు అంబటి కృష్ణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఆ నలుగురు సేవాసంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే శిబిరాన్ని కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు కంటి వైద్యశిబిరం

వజ్రపుకొత్తూరు: వెంకటాపురంలో పీహెచ్‌సీ ఆవరణలో సోమవారం కంటివైద్య శిబిరం నిర్వహించనున్నట్లు మాజీ సర్పంచ్ మరడ భాస్కరరెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యురాలు సుధారాణి తెలిపారు. ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు శిబిరం జరుగుతుందని పేర్కొన్నారు.

ఎస్‌ఐగా దుర్గాప్రసాదరావు

నరసన్నపేట: స్థానిక పోలీసుస్టేషన్‌లో ఎస్‌ఐగా సీహెచ్ దుర్గాప్రసాదరావు ఆదివారం బాధ్యతలను చేపట్టారు. అనంతరం సీఐ శ్రీనివాసరావుకు కలిశారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

పోలాకి: గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు కుటీర పరిశ్రమలు నిర్వహించి ఆర్థికంగా ఎదగాలన్నదే ప్రధాని మోదీ ధ్యేయమని టీడీపీ మండలాధ్యక్షులు మిరిబ్బిల్లి వెంకట అప్పలనాయుడు తెలిపారు. ఆదివారం పోలాకి వెలుగు కార్యాలయంలో పీఎం ప్రధానమంత్రి ప్రారంభించిన లక్షపతిదీదీ కార్యక్రమాన్ని వీడియోద్వారా తిలకించారు. వెలుగు ఏపీఎం గోరురాజారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో టీడీపీ నాయకులు భాస్కరరావు, ఎంవీనాయుడు, తర్రలక్ష్మీనారాయణ, అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

● **వజ్రపుకొత్తూరు:** మహిళలుఆర్థికంగా ఎదగాలన్న ఉద్దేశ్యంతో కేంద్రప్రభుత్వం లక్షపతి కార్యక్రమం నిర్వహిస్తోందని సెర్ప్ ఏపీఎం శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం వజ్రపుకొత్తూరులో మహిళాసంఘాలతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సీసీలు ధనలక్ష్మి, మంగమ్మ పాల్గొన్నారు.

● **నందిగాం:** స్థానిక వెలుగు కార్యాలయంలో ప్రధానమంత్రి లక్పతిదీదీ కార్యక్రమంలో మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు. ప్రధాని నరేంద్రమోదీ గుజరాత్‌లో ఈ కార్యక్రమాన్ని లైవ్ ద్వారా ప్రారంభించారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం కె.జాంభవతి, ఎంఎంఎస్ అధ్యక్షురాలు యశోద పాల్గొన్నారు.

ముత్యానికి నివాళి

పలాస రూరల్: మండలంలోని బొడ్డపాడు అమర వీరుల స్మారక మందిరంలో ఆదివారం ప్రొఫెసర్ డాక్టర్ ముత్యం సంతాపసభ వామపక్షాల ఆధ్వర్యంలో ఏర్పాటుచేశారు. తొలుత గ్రామంలో ర్యాలీ నిర్వహించి, అమరవీరుల స్మారకమందిరంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా పౌరహక్కుల సంఘం అధ్యక్షుడు పత్తిరి దానేసు, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి వంకల మాదవరావు, పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వినోద్, లిబరేషన్ నాయకులు తామాడ సన్యాసిరావు, మద్దిల రామారావు, సాలిన వీరాస్వామి, పీవోడబ్ల్యు జిల్లా అధ్యక్షురాలు ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక ఉపాధ్యక్షుడిగా వెంకటరావు

ఎల్.ఎన్.పేట: డొంకలబడవంజకు చెందిన పెద్దకోట వెంకటరావు ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఆదివారం శ్రీకాకుళంలో ప్రజాస్వామ్యపరిరక్షణ ఐక్యవేదిక విజయవాడ కేంద్ర కార్యాలయం ఆదేశాల మేరకు రాష్ట్ర కోశాధికారి జె. శ్రీనివాసరావు అధ్యక్షతన అన్ని మండలాల ప్రజాస్వామ్య పరిరక్షణ కార్యవర్గ సభ్యులతో సమావేశం జరిగింది.

లిఫ్ట్‌లో ఇరుక్కున్న జనసేన నాయకులు

●జిల్లా కేంద్రాసుపత్రిలో అరగంట పాటు తెరుచుకోని తలుపులు

టెక్కలి: టెక్కలిలోని జిల్లా కేంద్రాసుపత్రిలో ఆదివారం రాత్రి జనసేన నాయకుడు గుంటరాజు ఆసుపత్రిలో రెండోఫ్లోర్‌లో చికిత్సపొందుతుండడంతో పరామర్శకు వెళ్లిన ఆ పార్టీ జిల్లా ప్రధానకార్యదర్శి కూరాకుల యాదవ్, నాయకులు కొమ్ము హర్షవర్ధన్, అరుణ్‌లు తిరిగి లిఫ్ట్‌లో వస్తుండగా ఇరుక్కుపోయారు. దీంతో లిఫ్ట్ తలుపులు తెరవక, ఫ్యాన్ తిరగక ఊపిరాడని పరిస్థితిలో లిఫ్ట్‌లో ఆ ముగ్గురు ఆందోళనకు గురయ్యారు. సాయంత్రం 6.20 నుంచి 6.50గంటల వరకు లిఫ్ట్‌లో ఇరుక్కుపోవడంతో యాదవ్ నేరుగా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుకు, ఎస్పీ మహేశ్వరరెడ్డికి, సూపరింటెండెంట్ బొడ్డేపల్లి సూర్యారావుకు ఫోన్‌లో సమాచారం ఇచ్చారు. లిఫ్ట్‌లో ఉన్న బెల్‌కొట్టినా ఆ ప్రాంతంలో ఎవరూ స్పందించలేదు. ఆదివారం కావడం, ఆ సమయంలో ఎవరూ లేకపోవడం లిఫ్ట్‌లో ఇరుక్కున్న వీరికి అరగంట సేపు ఆందోళన నెలకొంది. కొంతసేపటి తరువాత ఆసుపత్రిలో ఉన్న పలువురు సిబ్బంది అక్కడకు చేరుకొని మరమ్మతులు చేపట్టి తలుపులు తీయడంతో ఆ ముగ్గురు బయటకు వచ్చారు. అప్పటికే ఎస్ఐ వెంకటేశ్వరరావుతో పాటు ఇతరులు ఆసుపత్రి వద్దకు చేరుకున్నారు. లిఫ్ట్‌లో రోగి ఇరుక్కుంటే పరిస్థితిఏమిటని యాదవ్ అక్కడున్న సిబ్బందిని ప్రశ్నించారు.కాగా లిఫ్ట్ సాంకేతిక సమస్యతో నిలిచిపోయిందని, ఆదివారం కావడంతో లిఫ్ట్ ఆపరేటర్ బయటకు వెళ్లాడని సూపరింటెండెంట్ డాక్టర్ సూర్యారావు తెలిపారు. సిబ్బంది సహకారతో లిఫ్ట్‌లో ఇరుక్కున్న వ్యక్తులను బయటకు తీసినట్లు చెప్పారు.

కషాయాల తయారీపై అవగాహన

పాతపట్నం: పాతపట్నం బ్రెడ్స్ కార్యాలయంలో బ్రెడ్స్ స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో ఏపీపీఐ ప్రాజెక్ట్‌లో భాగంగా ఆదివారం జీవామృత కషాయాల తయారీ, తెగుళ్లనివారణ చర్యలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏపీపీఐ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ జేవీరమణ మాట్లాడుతూ ప్రకృతి సాగుకు ఆధునిక విధానాలు జోడిస్తే అద్భుతఫలితాలు సాధించవచ్చని తెలిపారు. రిసోర్స్ పర్సన్ డీకేపాత్రో సమగ్రవ్యవసాయసాగు విధానాలపై శిక్షణనిచ్చారు. మెళియాపుట్టి, సారవకోట, హిరమండలం, పాతపట్నం మండలాల్లోని 82 గ్రామాల్లో ఈ ప్రోగ్రాం ద్వారా సేవలందించేందుకు సిబ్బందికి శిక్షణ నిర్వహించారు.

రైతు బజారు కోసం స్థల పరిశీలన



కాశీబుగ్గ పాత బస్టాండ్‌లో రైతులతో మాట్లాడుతున్న వెంకన్న చౌదరి

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీ పరిధిలో న్యూకాలనీలో,ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్ ప్రాంతం, పాతబస్టాండ్ పరిసరాలు, మూడురోడ్లజంక్షన్ వద్ద స్థలాలను రైతు బజారు ఏర్పాటుకోసం టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త వెంకన్న చౌదరి ఆదివారం పరిశీలించారు. అనంతరం కాశీబుగ్గ పాత బస్టాండ్‌లో ఉద్దానప్రాంత రైతులతో ఆయన మాట్లాడారు. ఆయనతో పాటు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబురావు,గాలి కృష్ణారావు, బడ్డ నాగరాజు, సప్ప నవీన్, నరేంద్ర (చిన్ని), రవిశంకర్ గుప్తా,డొక్కరి శంకర్, శ్రీనివాస్, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

పెంటిభద్రలో యువకుల శ్రమదానం

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీ పరిధిలోగల పెంటిభద్రకు చెందిన గిరిజన యువకులు ఆదివారం శ్రమదానం నిర్వహించారు. కాశీబుగ్గలోని కిడ్నీ ఆసుపత్రి రహదారి జంక్షన్ నుంచి పెంటిభద్ర వరకు రోడ్డుకు ఇరువైపులా పిచ్చి మొక్కలు, చెత్త తొలగించారు. చందాలు వేసుకొని రహదారిని అభివృద్ధిచేశామని టీడీపీ మాజీ కౌన్సిలర్ సవర రాంబాబు తెలిపారు.కార్యక్రమంలో తిరుపతి, అర్జున్, వైకుంఠ, ఉమాశంకర్, రమణ, మోహనరావు, గున్నయ్య, ఆదినారాయణ పాల్గొన్నారు.

బీజేపీలో పలువురి చేరిక

కాశీబుగ్గ: పలాసకు చెందిన తమ్మినాన మాధవరావు, నెమలిపురి అప్పారావు, రాజేష్ మంత్రలు ఆదివారం బీజేపీలో చేరారు. శ్రీకాకుళంలో బీజేపీ నాయకుల సమక్షంలో విశాఖ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు ఆధ్వర్యంలో చేరారు.

కాశీనగర్‌లో 'లక్షపతి దీదీ'

ఒడిశా

పర్లాకిమిడి: కాశీనగర్ పంచాయతీ సమితి కార్యాలయం వద్ద సమితి స్థాయి లక్షపతిదీదీ కార్యక్రమం ప్రధానమంత్రి నరేంద్రమోడి వర్చువల్‌గా ఆదివారం ప్రారంభించారు. ప్రభుత్వం మహిళా స్వయంసహాయక సంఘాల ద్వారా ఆర్థిక ఉన్నతికి దీనిని చేపట్టారు.421 మందికి లక్షాపతిదీదీని అందించనున్నారు.ఈ కార్యక్రమంలో సమితి అధ్యక్షురాలు బల్ల సాయమ్మ, బీడీఓ డొంబురుధర, బీపీఎం జగన్‌కుమార్‌బారిక్ పాల్గొన్నారు.

కార్టూన్లతో సామాజిక చైతన్యం

పర్లాకిమిడి: కార్టూన్లతో సామాజిక చైతన్యం కలిగించవచ్చని కార్టూనిస్టు మందూరు శేఖర్ తెలిపారు. పర్లాకిమిడి సరస్వతి శిశుమందిరంలో విద్యార్థులకు కార్టూన్ వన్ మ్యాన్‌షో ద్వారా కార్టూన్ల ఆవశ్యకతను వివరించారు.

మరమ్మతులు లేక..శిథిలావస్థకు చేరి

● ఇదీ సింగుపురం వద్ద పొగడవిల్లిగెడ్డపై గల వంతెన దుస్థితి

పాతపట్నం: మండలంలోని సింగుపురం సమీపంలో గల పొగడవిల్లి గెడ్డపైగల వంతెన దశాబ్దాలుగా మరమ్మతులకు నోచుకోకపోవడంతో పెచ్చులూడి శిథిలావస్థకు చేరింది. ఈ వంతెన మీదుగా సింగుపురం నుంచి బగడల వరకూ గల సుమారు ఎనిమిది గ్రామాల ప్రజలు పాతపట్నం, టెక్కలి వెళ్లేందుకు ఈ వంతెనమీదుగా రహదారిపై ప్రయాణించాల్సి ఉంటుంది. వంతెన నిర్మించి దశాబ్దాలు గడుస్తున్నా ఇప్పటివరకూ నిర్వహణ పనులకు నోచుకోలేదు. దీర్ఘకాలంగా పెచ్చులూడి శిథిలావస్థకు చేరినా అధికారులు కనీస మరమ్మతులకు చర్యలు తీసుకోవడం లేదని వాహన చోదకులు వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఈ వంతెన కనీస మరమ్మతులకు నోచుకుంటుందన్న ఆశలు రేకెత్తాయి. వంతెన కూలిపోతే చుట్టుపక్క గ్రామాల ప్రజలు పాతపట్నం, టెక్కలి చేరడానికి అగచాట్లు తప్పవు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు విద్య, వైద్యం కోసం ఈ వంతెన మీదుగా నిత్యం పాతపట్నం రాకపోకలు సాగిస్తుంటారు.



శిథిలావస్థకు చేరిన రెయిలింగ్

నీట్ పీజీలో చైతన్యకు 86వ ర్యాంకు



చైతన్య

పలాస: మండలంలోని బ్రాహ్మణతర్లాకు చెందిన దంతం చైతన్య నీట్ పీజీ ప్రవేశ పరీక్షలో ఆలిండియా 86వ ర్యాంకు సాధించాడు. ఆయన పదో తరగతి కాశీబుగ్గలో ఓ ప్రైవేటు కళాశాల, ఇంటర్ విశాఖలో చదివాడు. నీట్‌లో 309 ర్యాంకు సాధించి విశాఖపట్నంలోని ఆంధ్ర మెడికల్‌కళాశాలలో ఎంబీబీఎస్ చదివాడు. తండ్రి ఈశ్వరరావు మెళియాపుట్టి మండలంలోని గొప్పిలి ఉన్నతపాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తుండగా తల్లి శ్యామల గృహిణిగా ఉన్నారు. పీజీలో 86వ ర్యాంకు సాధించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

బాలికలకు రక్షణ కల్పిస్తాం: డీఈవో

కాశీబుగ్గ: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న బాలికలకు రక్షణ కల్పిస్తామని డీఈవో తిరుమల చైతన్య తెలిపారు. ఆదివారం కాశీబుగ్గ ఉన్నత పాఠశాలలో బాలికపై ఓ విద్యార్థి వేధింపులకు గురి చేస్తున్న ఘటనపై బాలిక, విద్యార్థి ఇళ్లల్ల విచారణ నిర్వహించారు. అనంతరం కాశీబుగ్గ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం చిన్నంనాయుడుకు విచారణ చేపట్టారు. నివేదికను కలెక్టర్‌కు అందించి, ఆయన ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో పలాస,వజ్రపుకొత్తూరు ఎంఈవోలు సత్యం, దాశరధి,హెచ్‌ఎం సీతమ్మ పాల్గొన్నారు.

స్నేహితుని కుటుంబానికి ఆర్థిక సాయం

సంతబొమ్మాళి: సంతబొమ్మాళిలో ఇటీవల మృతిచెందిన అల్లు యోగేశ్వరరావు కుటుంబానికి స్నేహితులు అండగా నిలిచారు.ఈ మేరకు ఆదివారం స్నేహితులంతా కలిసి రూ.21,350 కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో యువజన సంఘ ప్రతినిధులు కూశెట్టి భానుప్రకాష్,అట్టాడ సాయికుమార్, భాస్కరరావు పాల్గొన్నారు.

పశువులు స్వాధీనం

టెక్కలి: జాతీయరహదారిపై ఓ వాహనంలో అక్రమంగా తరలి పోతున్న పశువులను ఆదివారం టెక్కలి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పట్టుకున్న వాహనాన్ని పోలీసులు స్టేషన్‌కు తరలించారు. అయితే ఈ పశువులు గొదలాం ప్రాంతానికి తరలిస్తున్నామని రైతులు చెబుతున్నారు. కాగా ఎస్ఐ వెంకటేశ్వరరావు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రశాంతంగా గ్రూప్-2 మాక్ పరీక్షలు

పలాస: జంటపట్టణాల్లోని మదర్‌థెరిసా విద్యాలయంలో కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవరావు ఆధ్వర్యంలో ఆదివారం గ్రూప్-2 మాక్ పరీక్షలకు ప్రశాంతంగా జరిగింది. 35 మంది హాజరైనట్లు కేంద్ర నిర్వాహకులు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ కరస్పాండెంట్ వజ్జ గంగాభవాని, పరీక్షల ఇన్‌చార్జి ఆర్.ప్రసాదరావు, తారకేశ్వరరావు పాల్గొన్నారు.

●**టెక్కలి:** స్థానిక విశ్వజ్యోతి డిగ్రీ కళాశాలలో ఎర్రన్న విద్యా సంకల్పంలో భాగంగా గ్రూప్-2 మెయిన్స్ మాక్ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా నిర్వహించారు. ఉదయం 9.30గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు మొదటి పేపరు, మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 4.30గంటల వరకు రెండో పేపరు నిర్వహించినట్లు విశ్వజ్యోతి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పినకాన జోగారావు తెలిపారు. పోటీపరీక్షల్లో పాల్గొనే విద్యార్థులకు కోసం కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు ఈ పరీక్షలు నిర్వహించారు.

సీఆర్‌ఎంటీలకు ఉద్యోగ భద్రత కల్పించాలి

నరసన్నపేట: సీఆర్‌ఎంటీలకు ఉద్యోగ భద్రత కల్పించాలని సంఘ నాయకులు గిరిధర్ కోరారు.కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్‌కు ఆదివారం వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ గతప్రభుత్వకాలంలో సమ్మెచేసిన కాలానికి జీతాలుఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్షుడు పీటీ నాయుడు, బి.గిరిధర్, జయలక్ష్మి, డిల్లీశ్వరరావు, రామకృష్ణ, శ్రీనివాసరావు, యుగంధర్ పాల్గొన్నారు.

అగ్నివీర్ పిలుస్తోంది!



● నేటి నుంచి విశాఖలో ర్యాలీ ● జిల్లా నుంచి వందలాది మంది హాజరు ● ఇప్పటికే అహోరాత్రులు శిక్షణ

(ఇచ్ఛాపురం)

జిల్లాలో నిరుద్యోగులకు మరో సువర్ణావకాశం. నేటి నుంచి విశాఖలో ఆర్మీ అగ్నివీర్ రిక్రూట్‌మెంట్ ర్యాలీ ప్రారంభంకానుంది. ఇప్పటికే ఆన్‌లైన్ పరీక్ష పూర్తయింది. అందులో అర్హత సాధించిన వారికి ఫిజికల్ ఫిట్‌నెస్ పరీక్ష నిర్వహించనున్నారు. విశాఖలోని ఇందిరాగాంధీ ప్రియదర్శిని (పోర్టు) స్టేడియంలో 13 జిల్లాలకు చెందిన అభ్యర్థులకు ఫిజికల్ ఫిట్‌నెస్, ఈవెంట్స్ పరీక్షలు జరగనున్నాయి. అగ్నివీర్ జనరల్ డ్యూటీ, అగ్నివీర్ టెక్నికల్, అగ్నివీర్ ఆఫీస్ అసిస్టెంట్/స్టోర్ కీపర్, టెక్నికల్, ట్రేడ్స్‌మేన్‌లను భర్తీ చేయనున్నారు. జిల్లాలో వందలాది మంది రాతపరీక్షలో ఎంపికయ్యారు. ఫిజికల్ పరీక్షను ఎదుర్కొనున్నారు.

ఫిజికల్ టెస్ట్ తప్పనిసరి..

అన్నిపోస్టులకు ఫిజికల్ టెస్టులో అర్హత సాధించడం తప్పనిసరి. అందులో భాగంగా 1.6 కిలోమీటర్లు 5 నిమిషాల 30 సెకన్లలో పూర్తిచేస్తే 60 మార్కులు, 5 నిమిషాల 31 సెకన్ల నుంచి 45 సెకన్లలోపు పూర్తిచేస్తే 48 మార్కులు ఇస్తారు. కనీసం ఆరు పులప్స్ తీయాలి. ఆరు తీసిన వారికి 16 మార్కులు, ఏడు తీస్తే 21, ఎనిమిది తీస్తే 27, తొమ్మిదికి 33, 10 తీస్తే 40 మార్కులు పొందవచ్చు. 9 అడుగుల దూరం లాంగ్ జంప్ చేస్తే అర్హత సాధిస్తారు. జిగ్‌జాగ్ బ్యాలెన్స్‌లో అర్హత సాధించాలి. అనంతరం ఫిజికల్ మెజర్‌మెంట్, మెడికల్ పరీక్షలు ఉంటాయి. వీటిన్నింటిలో విజయవంతమైతే శిక్షణకు ఎంపిక చేస్తారు.

వేతనాలు ఇలా..

అగ్నివీర్ ఉద్యోగాలకు ఎంపికైతే తొలి ఏడాది నెలకు రూ.30 వేలు, రెండో ఏడాది నెలకు రూ.33 వేలు, మూడో ఏడాది రూ.36,500, నాలుగో ఏడాది నెలకు రూ.40 వేలు వేతనంగా అందిస్తారు. నాలుగేళ్లకు సేవానిధి ప్యాకేజీని అందిస్తారు. వార్షిక సెలవులు 30 వరకూ ఉంటాయి. ఆరోగ్య సమస్యలు బట్టి సిక్ లీవ్ ఇస్తారు. నాలుగేళ్ల పాటు సర్వీసులో ఉన్నప్పుడు రిస్క్ అండ్ హార్డ్‌షిప్, రేషన్, డ్రెస్, ట్రావెల్ అలవెన్స్‌లు అందిస్తారు. నాలుగేళ్ల పాటు రూ.48 లక్షలకు లైఫ్ ఇన్సూరెన్స్ కవర్ చేస్తారు. నాలుగేళ్ల సేవకుగాను వీరికి అగ్నివీర్ స్కిల్ సర్టిఫికెట్ అందిస్తారు. ఇంటర్ సమాన స్థాయి సర్టిఫికెట్ అందిస్తారు. వీరికి పింఛన్, గ్రాడ్యూటీ వర్తించవు. ఎక్స్ సర్వీస్‌మెన్‌గా గుర్తించరు. కరువుభత్యం, మిలటరీ సర్వీస్ పే వీరికి వర్తించదు. ప్రావిడెంట్ ఫండ్ (పీఎఫ్) సైతం ఉండదు. నాలుగేళ్ల వ్యవధి పూర్తి చేసుకున్న అగ్నివీర్ బ్యాచ్ నుంచి 25 శాతం మందిని ఆర్మీలో రెగ్యులర్ ఉద్యోగులుగా తీసుకుంటారు. ఇందుకోసం నాలుగేళ్ల వ్యవధిలో చూపిన ప్రతిభను ప్రామాణికంగా తీసుకుంటారు. ఇలా ఎంపికైన వారు 15 ఏళ్ల పాటు ఆర్మీ సర్వీసులో కొనసాగవచ్చు.


సురంగి రాజా మైదానంలో ప్రాక్టీస్ చేస్తున్న యువకులు..

సేవానిధికి జమ ఇలా..

సేవానిధిలో భాగంగా ప్రతి నెలా అందుకునే మొత్తంలో 30 శాతం కార్పస్ ఫండ్‌కి జమచేస్తారు. మొదటి నెల పొందే రూ.30 వేల వేతనంలో రూ.9 వేలను కార్పస్ ఫండ్‌కు బదలాయిస్తారు. అగ్నివీర్‌కు కేవలం రూ.21 వేలు మాత్రమే అందుతుంది. రెండో ఏడాది వచ్చేసరికి రూ.23,100 వేతనం రూపంలో అందుతుంది. రూ.9,900 నిధికి జమ అవుతుంది. మూడో ఏడాదికి రూ.25,500 వేతనంగా అందుతుంది. రూ.10,950 నిధికి వెళుతుంది. నాలుగో ఏడాదికి వచ్చేసరికి వేతనంగా రూ.28 వేలు, నిధికి రూ.12 వేలు వెళతాయి. ఇలా నాలుగేళ్లలో అగ్నివీర్ సేవా నిధికి రూ.5.02 లక్షలు పోగవుతుంది. ఇంతే మొత్తం ప్రభుత్వం జమచేస్తుంది. ఈ లెక్కన ఈ నాలుగేళ్లలో రూ.10.04 లక్షలు అందుతాయన్న మాట. దీనికి వడ్డీ మొత్తం కలిపి అందిస్తారు. అగ్నివీర్‌లకు బ్యాంకు రుణం అందే సదుపాయం సైతం కల్పిస్తారు.

వైసీపీ నాయకుడి కారు ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలు


దెబ్బతిన్న కారు ముందు భాగం

నందిగాం: నందిగాం బస్టాండ్ సమీపంలో గల జాతీయ రహదారికి ఆనుకొని సర్వీస్ రోడ్డులో ఆదివారం సాయంత్రం వైసీపీ నాయకుడు పేరాడ తిలక్‌కు చెందిన కారు ఢీకొన్న ఘటనలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. నందిగాం ఎంపీపీ ఎన్.శ్రీరామ్మూర్తి, జడ్పీటీసీ మాజీ సభ్యుడు కె.బాల కృష్ణారావు తదితరులతో కలిసి వివిధ కార్యక్రమాల్లో పాల్గొని పార్టీ కార్యాలయానికి వస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. టెక్కలి నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త పేరాడ తిలక్ కారు.. టెక్కలి నుంచి నందిగాం సర్వీసు రహదారిలోకి వస్తుండగా బ్రేకులు ఫెయిల్ కావడంతో ముందుగా వెళ్తున్న కారుకు తగిలి ఆటోను ఢీకొంది. బెజ్జిపల్లికి చెందిన పొందర తేజారావు తన ఆటోలో భార్య అరుణకుమారితో కలిసి నందిగాం వచ్చి తిరిగి వెళ్తుండగా కారు ఆటోను ఢీకొంది. దీంతో ఆటో నడుపుతున్న తేజారావుతో పాటు భార్య అరుణకుమారి తీవ్రంగా గాయాలయ్యాయి. గాయపడిన వీరిని హైవే అంబులెన్స్‌లో టెక్కలి జిల్లా కేంద్రాసుపత్రికి తరలించారు. అరుణకుమారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నందిగాం ఎస్ఐ మహ్మద్ అమీర్ ఆలీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా తిలక్ రోడ్డు ప్రమాదానికి గురయ్యారన్న విషయం తెలుసుకున్న పలువురు కార్యాలయానికి చేరుకొని ఆయనతో మాట్లాడారు.

ప్రమాదంపై మంత్రి అచ్చెన్న ఆరా

టెక్కలి: వైసీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ నందిగాంలో రోడ్డు ప్రమాదానికి గురికావడంతో మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదివారం ఆరాతీశారు. తిలక్‌కు మంత్రి అచ్చెన్నాయుడు ఫోన్‌చేసి పరిస్థితి అడిగి తెలుసుకున్నారు.

చెరువులో పడి ఒకరి మృతి

ఇచ్ఛాపురం: ఈదుపురం గ్రామానికి చెందిన గాలి శేషగిరి(55) ఇన్నేసుపేట గ్రామ చెరువులో పడి మృతి చెందాడు. ఆదివారం చెరువులో శేషగిరి మృతదేహాన్ని చూసిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. రూరల్ ఎస్ఐ శ్రీనివాసరావు పరిశీలించి కేసు నమోదు చేశారు. శేషగిరికి భార్య, కొడుకు ఉన్నాడు. కాగా శేషగిరి కూలిపని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. కుటుంబ పెద్ద మరణంతో ఆ కుటుంబం రోడ్డున పడింది. ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

చికిత్స పొందుతూ మరొకరు..

హరిపురం: చికిత్సపొందుతూ ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. మందస పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పోలాకిలో నివాసముంటున్న కొండల డిల్లేశ్వరరావు (53) తన మేనకోడల వివాహానికి మఖరజోల శనివారం సాయంత్రం వచ్చాడు. వివాహ అనంతరం ఇంటిలో ఏర్పడిన వివాదంతో పొలానికి వెళ్లి గడ్డి మందు తాగాడు. పొలంలోనే అచేతనంగా పడి ఉండడంతో స్థానికులు బంధువులు పలాస ఆసుపత్రిలో చేర్చారు. పరిస్థితి విషమించడంతో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. దీంతో మఖరజోలలో విషాదఛాయలు అలముకున్నాయి. ఘటనపై మందస పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీసీ కెమెరాల వైర్లు కత్తిరించి..

● ఆలయం హుండీ ఎత్తుకెళ్లి నగదు చోరీ


కత్తిరించిన సీసీ కెమెరాల వైర్లు


హుండీని పరిశీలిస్తున్న క్లూస్ టీమ్

పలాస: స్థానిక కంబిరిగాం రోడ్డులో వెలసిన సీతమ్మ తల్లి ఆలయంలో శనివారం రాత్రి దొంగలు హల్‌చల్‌చేశారు. ఆలయంలోని సీసీ కెమెరాల వైర్లు కత్తిరించి లోపలకు చొరబడ్డారు. అనంతరం అమ్మవారి హుండీని బయటకు ఎత్తుకు ఎత్తుకెళ్లి అందులో ఉన్న రూ.ఐదు వేల నగదు అపహరించారు. సీతమ్మతల్లి ఆలయంలో 2014 నుంచి ఇప్పటి వరకూ మొత్తం ఏడుసార్లు ఆలయంలో దొంగలు చొరబడి హుండీని ఎత్తుకువెళ్లారు. ఇప్పటి వరకూ ఈ కేసులకు సంబంధించి ఒక్కరిని కూడా పట్టుకోలేకపోయారు. నిర్వాహకులు, స్థానికుల కథనం మేరకు.. ఆలయ అర్చకులు ఇప్పిలి సాయమ్మ ఆదివారం ఉదయం తెరవడానికి వచ్చేసరికి తాళాలు బద్దలుగొట్టి నట్టు గుర్తించారు. లోపలికి వెళ్లి పరిశీలించగా హుండీ కనిపించలేదు. ఆలయ ప్రహరీలోపల బద్దలుగొట్టి ఉన్నట్టు గుర్తించి స్థానిక కౌన్సిలర్ గురిటి సూర్యనారాయణ, కమిటీ సభ్యులు గాలి కృష్ణారావు, చిన్నారావు, హరికృష్ణకు సమాచారం అందించారు. వారు పరిశీలించిన తర్వాత కాశీబుగ్గ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తరచూ దొంగతనాలు జరుగుతున్న దృష్ట్యా అమ్మవారి నగలు ప్రతి మంగళవారం అలంకరించి దాచేస్తుంటారు. హుండీ లెక్కింపు కూడా మూడు నెలలకు ఓసారి నిర్వహిస్తుంటారు. ఈ మేరకు కొద్ది రోజుల కిందటే హుండీని తెరిచారు. ప్రస్తుతం హుండీలో రూ.ఐదు వేల వరకూ నగదు ఉంటుంది. దొంగలు చొరబడి ముందుగా సీసీ కెమెరాలకు ఉన్న వైర్లను కత్తిరించి జాగ్రత్తపడ్డారు. శ్రీకాకుళం క్లూస్ టీమ్ సభ్యులు ఘటన స్థలానికి చేరుకొని వేలిముద్రలు సేకరించారు. దొంగలు వచ్చే మార్గాన్ని అంచనా వేశారు. ఈ మేరకు ఆలయ నిర్వాహకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులుకేసు నమోదు చేశారు. ఆలయంలో తరచూ దొంగతనాలు జరుగుతుండడం భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతంలో పోలీసు గస్తీ పెట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ఆక్రమణలపై చర్యలు తీసుకోండి

కంచిలి: అంపురం పంచాయతీ జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న సర్వేనెంబరు 116/1-బీలో 1.12 ఎకరాల భూమిని కొంతమంది ఆక్రమించుకోవాలని చూస్తున్నారని సీపీఐ నాయకులు సాలిన నారాయణ స్వామి, అయినింటి లోకనాథం, వాసు అన్నారు. ఈ మేరకు ఆదివారం ఆక్రమించిన స్థలంలో ఉన్న షెడ్డు వద్ద వారు నిరసన తెలిపారు. ఈ స్థల యజమాని లక్ష్మీ కనకవల్లి ఆరు దుకాణాలు నిర్మించుకుని జీవనోపాధి పొందుతుందని, గత కొన్ని నెలలుగా ఈ దుకాణాలను అద్దెకు తీసుకున్న కొందరు ఆమెకు అద్దె ఇవ్వకుండా ఆ దుకాణాలు తమవని ఆక్రమించుకోవాలని చూస్తున్నారన్నారు. ఈ విషయంలో తహసీల్దార్, పోలీసులు కలుగజేసుకుని ఆమెకు న్యాయం చేయాలని కోరారు.

ఆదిత్యుని ఆదాయం రూ.4.01 లక్షలు

అరసవల్లి: ఆరోగ్య ప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామివారిని ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఇంద్రపుష్కరిణిలో పవిత్ర స్నానాలు ఆచరించి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం ఒక్కరోజు స్వామివారికి రూ.4,01,073 ఆదాయం లభించింది. ఇందులో టిక్కెట్ల ద్వారా రూ.1,52,600, విరాళాల ద్వారా రూ.74,873, ప్రసాదాల రూపంలో రూ.1,73,600 ఆదాయం లభించినట్టు ఆలయ ఈవో చంద్రశేఖర్ తెలిపారు. ఎమ్మెల్సీ నర్తు రామారావు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. శ్రీకాకుళం నగరానికి చెందిన కీర్తి గోవిందరావు, పొట్నూరు వెంకట సాయికృష్ణ కుటుంబసమేతంగా స్వామివారిని దర్శించుకున్నారు. నిత్యాన్నదాన పథకానికి చెరో రూ.లక్ష ఆలయ అధికారులకు అందజేశారు.

ఉపాధి కల్పించడమే లక్ష్యం


నిరుద్యోగ యువతతో ఎమ్మెల్యే ఎన్ఈఆర్

రణస్థలం: నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. ఆదివారం ఎన్ఈఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ఎపిటోరియా పరిశ్రమకు సంబంధించిన జాబ్‌మేళా జరిగింది. గత రెండు నెలల్లో 400 మంది నిరుద్యోగులకు వివిధ పరిశ్రమల్లో ఉపాధి కల్పించామన్నారు. ఆదివారం నిర్వహించిన జాబ్‌మేళాకు సుమారు 1000 మంది హాజరయ్యారని, అర్హులైన వారికి ఫోన్ ద్వారా సమాచారం అందజేస్తామన్నారు. కార్యక్రమంలో పరిశ్రమ ప్రతినిధులు హెచ్‌ఆర్ కమలాకర్, స్కూల్ డైరెక్టర్ తేజాబాబు, పాల్గొన్నారు.

సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

● కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు


కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు

గుజరాతీపేట: సమానత్వం, స్వేచ్ఛ, న్యాయం, సహనం, భిన్నత్వంపై గౌరవం వంటి ప్రజాస్వామ్య విలువలను ప్రోత్సహించడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. నగరంలోని అరసవల్లి ఆలయం సమీపంలో పీఆర్‌టీయూ నూతన భవనాన్ని ఎమ్మెల్యే గొండు శంకర్‌తో కలిసి ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్య నాణ్యత ఉపాధ్యాయుడిపై ఆధారపడి ఉంటుందని, ఏ దేశానికైనా ఉపాధ్యాయులే వెన్నెముక అన్నారు. అంతకముందు పీఆర్‌టీయూ భవన ప్రారంభోత్సవం వైభవంగా జరిగింది. కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు, రాష్ట్ర అధ్యక్షుడు మిట్ట కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి ఏఎం గిరి ప్రసాద్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వైష్ణవ కరుణానిధి మూర్తి, గౌరవాధ్యక్షులు బైరి అప్పారావు, సభాధ్యక్షులు తంగి మురళీమోహన్, జిల్లా ప్రధాన కార్యదర్శి దానేటి కేశవరావు, గౌరవాధ్యక్షుడు జె.బాబూరావు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్రకే తలమానికం.. జెమ్స్

● రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు


మంత్రికి పుష్ప గుచ్ఛం అందిస్తున్నజెమ్స్ అధినేత

అరసవల్లి: ప్రజలకు మెరుగైన వైద్య సేవలతో పాటు ఆరోగ్యకర సమాజం కోసం ఎంతోమంది వైద్యులను అందిస్తున్న జెమ్స్ ఆసుపత్రి ఇటు ఉత్తరాంధ్ర, అటు ఒడిశాకు తలమానికంగా మారిందని రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కొనియాడారు. ఆదివారం నిమ్మాడలోని క్యాంపు కార్యాలయంలో మంత్రిని కిమ్స్, జెమ్స్ చైర్మన్ బొల్లినేని భాస్కరరావు ఆత్మీయ పూర్వకంగా కలుసుకున్నారు. అత్యాధునిక మౌలిక వసతులతో నిర్మించిన జెమ్స్ ఆసుపత్రిని, జెమ్స్ మెడికల్ కాలేజీ, బొల్లినేని మెడిస్కిల్ సెంటర్లు, కొత్తగా విస్తరిస్తున్న కిమ్స్ ఆసుపత్రితో పాటు టెక్కలి జిల్లా ఆసుపత్రి, రిమ్స్ వైద్య కళాశాల, రిమ్స్ జనరల్ ఆసుపత్రి, మిగతా కార్పొరేట్ ఆసుపత్రులను అనుసంధానిస్తూ ఒక మెడికల్ హబ్‌గా శ్రీకాకుళం జిల్లాను అభివృద్ధి చేస్తామన్నారు.

సంజీవనిగా.. జెమ్స్ ఆసుపత్రి


కేంద్ర మంత్రికి పుష్పగుచ్ఛం అందిస్తున్న దృశ్యం

జెమ్స్ ఆసుపత్రి జిల్లా ప్రజలకు మాత్రమే కాకుండా అటు ఒడిశా, ఇటు ఉత్తరాంధ్ర ప్రజలకు అనునిత్యం వేలాదిమందికి ప్రాణ రక్షణ కల్పిస్తూ సంజీవనిగా సేవలందిస్తోందని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ప్రశంసించారు. నగరంలో కేంద్రమంత్రిని ఆయన నివాసంలో కిమ్స్, జెమ్స్ అధినేత బొల్లినేని భాస్కరరావు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. వైద్య కళాశాలలో సీట్ల సంఖ్యను పెంచేందుకు కృషి చేస్తానన్నారు. మంత్రిని కలిసిన వారిలో జెమ్స్ సీఈవో బొల్లినేని అద్విత్, డైరెక్టర్లు కె.సుధీర్, గూడేన సోమేశ్వరరావు, స్వర్ణ రామ్మోహనరావు, పొందూరు శ్రీనివాసరావు ఉన్నారు.

మహిళా సాధికారితే లక్ష్యం

పొందూరు: మహిళా సాధికారత సాధించాలంటే మహిళలు సంపాదనాపరులు కావాలని ఎమ్మెల్యే కూన రవికుమార్ సతీమణి మాజీ ఎంపీపీ కూన ప్రమీల అన్నారు. కేంద్ర ప్రభుత్వం మహిళల కోసం ప్రవేశపెట్టిన దీదీ పథకం ప్రారంభోత్సవంలో భాగంగా మండల కేంద్రంలో ఎంపీడీవో సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. మండలంలో 43 సంఘాలకు రూ.3.43 కోట్లు అందించారు. కార్యక్రమంలో ఏపీఎం జి.శ్యామలరావు, టీడీపీ మండల అధ్యక్షుడు సీహెచ్ రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ సంఘం బలోపేతానికి కృషి

శ్రీకాకుళం స్పోర్ట్స్: కబడ్డీ సంఘం బలోపేతానికి తమవంతు కృషిచేస్తానని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. స్థానిక ఎస్టీఎఫ్ కార్యాలయంలో జిల్లా కబడ్డీ సంఘం సర్వసభ్య సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. క్రీడాకారులను తయారు చేసేలా మరిన్ని పోటీలు జిల్లాలో నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా కబడ్డీ సంఘం నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చైర్మన్‌గా గొండు శంకర్, ప్రెసిడెంట్‌గా నక్క కృష్ణారావు, ప్రధాన కార్యదర్శిగా సాధు శ్రీనివాసరావు, ట్రెజరర్‌గా ఎన్.రమేష్, ఉపాధ్యక్షులుగా ఎం.సాయికుమార్, జి.యమునారాణి, ఆర్.లక్ష్మీనాయుడు ఉన్నారు. సంయుక్త కార్యదర్శులుగా డి.తవిటమ్మ, ఎస్.కోటేశ్వరరావు, ఎం.తిరుపతిరావు, జె.నారాయణ, ఎస్.రమేష్, కె.రవికుమార్ ఉన్నారు. అదేవిధంగా ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా ఎన్.చిరంజీవి, ఎస్.కృష్ణారావు, ఎన్.శివకుమార్, ఆర్.సాగర్, జి.భాస్కర్, ఎస్.నీలయ్య, టి.సరిత ఉన్నారు. ఈ ఎన్నిక జిల్లా ఒలింపిక్ సంఘం కార్యదర్శి ఎం.సాంబమూర్తి, సలహాదారు పి.సుందరరావు పర్యవేక్షణలో జరిగింది.

నారాయణపురం కుడి కాలువకు నీరు విడుదల

పొందూరు: సంతకవిటి మండలం కావలి సమీప కాలువలో ఇరిగేషన్ అధికారుల పర్యవేక్షణలో మండల రైతులు చెత్త తొలగించడమంతో పాటు షట్టర్లు ఎత్తడంతో నారాయణపురం కుడికాలువకు నీరు విడుదలైంది. నారాయణపురం కుడి కాలువకు నీరు రాకపోవడంతో రైతులు ఎమ్మెల్యే రవికుమార్, అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో రవికుమార్ ఆదేశాలతో ఇరిగేషన్ ఎస్ఈ సుధాకర్, డీఈ మురళీమోహన్, ఏఈ రవికుమార్ సమక్షంలో మండలానికి చెందిన రైతులు పి.రామారావు, ఎ.శ్రీను, కె.కృష్ణ, డి.గణపతి, డి.జగన్మోహనరావు, బి.సత్యంతో పాటు కింతలి, కనిమెట్ట, తోలాపి, సింగూరు, బొడ్డేపల్లి రైతులు పూనులు ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం వరకు అక్రమంగా వేసిన పూనులు తొలగిండంతో పాటు చెత, తొలగించి నీటిని విడుదల చేశారు.

అజ్ఞానాన్ని తొలగించే వారే గురువు

గుజరాతీ పేట: విద్యార్థుల్లోని అజ్ఞానాన్ని తొలగించేవారే గురువు అని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని పీఎన్ కాలనీలో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ పరిచయ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గురువు అంటే సాక్షాత్తు భగవంతుడి స్వరూపం అన్నారు. కార్యక్రమంలో బుడుమూరు శ్రీరామ్మూర్తి, కొండపల్లి రామారావు, అంధవరపు సంతోష్, అంధవరపు ప్రసాద్ పాల్గొన్నారు.

రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలి

ఆమదాలవలస: ప్రాణాపాయ స్థితిలో ఉన్నవాకికి రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహన్‌రావు పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని ఓ కల్యాణ మండపంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. స్వచ్ఛంద సంస్థలు, వివిధ సేవా సంఘాలు రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసి రెడ్‌క్రాస్ ద్వారా అత్యవసర రోగులకు ఉత్తమసేవలు అందించడం అభినందనీయమన్నారు. 92 మంది రక్తదానం చేశారు. వైద్యులు కూర్మాన వినోద్‌కుమార్, పి.తాతయ్యలు, సీహెచ్ సుధాకర్, గురుగుబిల్లి చిన్ను తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్-2 మెయిన్స్ మాక్ పరీక్షకు స్పందన

అరసవల్లి: ఎర్రన్న విద్యా సంకల్పంలో భాగంగా గ్రూప్-2 మెయిన్స్‌కు ఎంపికైన అభ్యర్థులకు శ్రీకాకుళం విద్యాధరి కళాశాల, టెక్కలి విశ్వజ్యోతి డిగ్రీ కళాశాల, పలాస మదర్ థెరిస్సా స్కూల్‌లో ఆదివారం మాక్ టెస్టు నిర్వహించారు. ఈ పరీక్షకు జిల్లా నలుమూలల నుంచి 300 మందికి పైగా హాజరయ్యారు. సందర్భంగా అభ్యర్థులు మరింత ధృడ సంకల్పంతో సాధన చేసి పరీక్షల్లో విజయం సాధించాలని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు అభ్యర్థులకు పిలుపునిచ్చారు.

సామాజిక కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలి

రణస్థలం: యువత సామాజిక కార్యక్రమంలో భాగస్వామ్యం కావడం చాలా ఆనందంగా ఉందని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు అన్నారు. ఆదివారం ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు క్యాంపు కార్యాలయాన్ని ఆయన సందర్శించి, ఎన్ఈఆర్ కుటుంబ సభ్యులతో కాసేపు ముచ్చటించారు. అదేవిధంగా మండల కేంద్రంలో గత 241 రోజులుగా డొక్క సీతం పేరిట నిరుపేదలకు ఉచిత భోజన సదుపాయం కల్పిస్తున్న జనసేన నేత గొర్లె సూర్యను అభినందించారు. ఎమ్మెల్యే ఎన్ఈఆర్, ఎంపీ కలిశెట్టి, కూటమి నాయకులు లంక శ్యామలరావు, ముప్పిడి సురేష్, పిషని జగన్నాథంనాయుడు పాల్గొన్నారు. అలాగే మండల కేంద్రంలో 'అరే మావా' యూట్యూబ్ చానల్ 20 లక్షల మంది ఫాలోవర్స్ సాధించిన సందర్భంగా రమణ నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని కేంద్ర మంత్రి రామ్మోహన్ ప్రారంభించారు. సుమారు 200 మంది వరకు రక్తదానం చేశారు.

విధుల్లో కొనసాగించాలి

ఎచ్చెర్ల: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలో ఔట్ సోర్సింగ్ విధానంలో ఈ ఏడాది జనవరిలో నియమించిన 34 మంది బోధనేతర సిబ్బందిని కొనసాగించాలని ఆదివారం మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును కలిసి విన్నవించుకున్నారు. నిమ్మాడలోని క్యాంప్ కార్యాలయంలో మంత్రిని కలిసి తమ సమస్యను విన్నవించుకున్నారు. ఎనిమిది నెలల నుంచి జీతాలు చెల్లించడంలేదన్నారు.


కవిటి: ఆనాటి ఉపాధ్యాయులతో విద్యార్థులు


గుజరాతీపేట: ఆనాటి ఉపాధ్యాయులను సన్మానిస్తున్న విద్యార్థులు

పూర్వ విద్యార్థుల కలయిక

కవిటి: బొరివంక జడ్పీ ఉన్నత పాఠశాలలో 2013లో టెన్త్ చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం అదే పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనాటి జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. అనంతరం అప్పటి చదువు చెప్పిన గురువులకు సాలువలతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు.

● గుజరాతీపేట: స్థానిక చిన్నబజార్‌లో గల ఓ కల్యాణ మండపంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల, శ్రీకాకుళంలో 1984లో పదవ తరగతి చదువుకున్న వారంతా ఆదివారం ఒక చోట కలిశారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఈ సదర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించుకున్నారు.

శ్రీకూర్మం వరకు బస్సు నడపాలి

గార: ప్రసిద్ధ శ్రీకూర్మం క్షేత్రం దర్శించే దూర ప్రాంత భక్తుల సౌకర్యార్థం శ్రీకాకుళం నుంచి శ్రీకూర్మం క్షేత్రం వరకు షటిల్ బస్సు నడపాలని పలువురు దూర ప్రాంత భక్తులు, ఆర్టీసీ అధికారులను కోరుతున్నారు. ఎంతో చారిత్రక ప్రసిద్ధి చెందిన ఈ క్షేత్రం దర్శనానికి దేశం వివిధ ప్రాంతాలు నుంచి భక్తులు వస్తుంటారని అయితే ఇక్కడకు చేరుకోవడానికి బస్సు సౌకర్యం లేక భక్తులు ప్రైవేటు వాహనాల్లో ఇక్కడకు రావాల్సి వస్తోందని అరసవల్లి క్షేత్రాన్ని దర్శించిన భక్తులు ఇక్కడ కూడా స్వామి దర్శనానికి వస్తుంటారని ఈ నేపథ్యంలో షటిల్ బస్సు నడపాలని ఇందుకు ఎమ్మెల్యే గొండు శంకర్ చర్యలు తీసుకోవాలన్నారు.

శాస్త్రీయంగా ప్రచారం చేద్దాం

గుజరాతీపేట: సైన్స్ ఉద్యమం ద్వారా మూఢనమ్మకాలు లేని శాస్త్రీయ సమాజాన్ని నిర్మించాలని పిలుపునిచ్చారు. స్థానిక యూటీఎఫ్ భవనంలో ఆదివారం జిల్లా అధ్యక్షుడు కె.కామేశ్వరరావు అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జాతీయ కార్యవర్గ సభ్యులు గొంటి గిరధర్ మాట్లాడుతూ.. గత ఏడాది కాలంలో జనవిజ్ఞాన వేదిక చేసిన సైంటిఫిక్ టెంపర్ క్యాంపేన్‌ను వివరించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.రాజగోపాల్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని మండలాల్లో మండల కమిటీలు నిర్మించి జన విజ్ఞాన వేదిక కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో బొడ్డేపల్లి మోహన్‌రావు, యూటీఎఫ్ నాయకులు బమ్మిడి శ్రీరామ్మూర్తి, వీజీకే మూర్తి, ఎస్.శశిభూషణరావు, జేవీవీ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.పద్మనాభరావు, బి.జనార్దనరావు, ఎం.వాగ్దేవి, పి.కూర్మారావు, ఎస్.సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రేమతో మెలగాలి

శ్రీకాకుళం కల్చరల్: ప్రతి ఒక్కరూ ప్రేమతో మెలగాలని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. స్థానిక కత్తెర వీధిలో మెహర్ బాబా కేంద్రాలయంలో శ్రీకాకుళం కేంద్రం 60వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ.. వృద్ధుల పట్ల జాలి చూపించి ప్రేమతో మెలగాలని మెహర్‌బాబా బోధనలో నైతిక విలువలు పెంపొందిస్తాయన్నారు. ఈ సందర్భంగా మెహర్‌బాబా చిత్ర పటానికి పూలమాలలు వేశారు. ఉమామహేశ్వరరావు, బాస్కర్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎరువులు అందించాలి

కంచిలి: మండలంలోని రైతులకు అవసరమైన ఎరువులు అందించాలని రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడిను పార్టీ మండల కార్యదర్శి మాదిన రామారావు, కూటమి నాయకులతో కలసి ఆదివారం అందజేసినట్లు తెలిపారు. రైతులకు కావలసిన పొటాష్, డీఏపీ, యూరియా అందించేందుకు చర్యలు తీసుకోవాలని కోరామన్నారు.

డొంకూరులో పొగురు తీత


పొగురు తీయిస్తున్న రైతులు

ఇచ్ఛాపురం: ఇటీవల ఒడిశాలో కురిసిన భారీ వర్షాలకు డొంకూరు పంట పొలాలకు వరద నీరు వచ్చి చేరింది. దీంతో ఆదివారం డొంకూరు గ్రామానికి చెందిన రైతులంతా చందాలు వేసుకొని శ్రమదానం చేసి జేసీబీ సాయంతో పొగురు తీత చేపట్టారు. ప్రతీసారి వరదలకు రైతుల పంట పొలాలు దెబ్బతింటున్నాయి. వీటికి ప్రత్యామ్నాయంగా ప్రభుత్వం ఏర్పాట్లు చేయాలని రైతులు కోరుతున్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు దున్న లోకనాథం తదితరులు పాల్గొన్నారు.

గుంతలు పూడ్చివేత

బూర్జ: నీలాదేవిపురం కూడలి వద్ద ప్రధాన రహదారిలో గుంతలను ఆదివారం పూడ్చారు. ఇక్కడి గుంతలు వల్ల పలు ప్రమాదాలు జరుగుతున్నందున పోలీసుల సూచనలతో టీడీపీ నాయకులు టి.శ్రీనివాసరావు, సమీప గ్రామాల యువత ఎర్రమట్టితో గుంతలను పూడ్చినట్టు కానిస్టేబుల్ ఉమామహేశ్వరరావు తెలిపారు. శ్రీనివాసరావు తన సొంతఖర్చులతో గుంతలను పూడ్చారు.

రుణాలు అందజేత

ఆమదాలవలస: మండల సమాఖ్య కార్యాలయంలో ప్రధాని మోదీ ప్రారంభించిన లక్షపతి దీదీ కార్యక్రమాన్ని లైవ్ టెలికాస్ట్ ద్వారా సభ్యులందరికీ వెలుగు ఏపీఎం పైడి కూర్మారావు అవగాహన కల్పించారు. బాగా పనిచేసిన సీఆర్పీలను, గుర్తించి మండల సమాఖ్య ప్రతినిధులు వారికి సర్టిఫికెట్లు అందించారు. ధనలక్ష్మీ, ఉషారాణి, క్లస్టర్ కో-ఆర్డినేటర్లు తదితరులు పాల్గొన్నారు.